


# విజయభాను




విజయవాడ, శనివారం 09-02-2019 | VIJAYABHANU DAILY VIJAYAWADA EDITION | సంపుటి : 11 సంచిక : 210 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## చెప్పినదానికంటే ఎక్కువే

# అమలు చేశాం

### ఆర్టీసీ ఉద్యోగులకు 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చాం

### ఓటాన్ బడ్జెట్‌పై సీఎం బాబు ప్రసంగం



అమరావతి: మేనిఫెస్టోలో ఇవ్వని హామీలను కూడా అమలు చేశామని ముఖ్య మంత్రి చంద్రబాబు అన్నారు. చెప్పిన దానికంటే ఎక్కువే చేశామని వివరించారు. రైతులకు రూ.1.5 లక్షలు రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనని చెప్పారు. ఈ మేరకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అసెంబ్లీలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గడిచిన నాలుగున్నరేళ్లలో 295 హామీలను అమలు చేశాం. మేనిఫెస్టోలో ఇవ్వని హామీలు కూడా అమలు చేశాం. రైతుల రుణాలను మాఫీ చేశాం. డ్వాక్రా సంఘాలకు నిధులిచ్చాం. ప్రజల వైద్య ఖర్చులు కనిష్ఠ స్థాయికి తీసుకొచ్చాం. బీసీలకు సబ్‌ప్లాన్ తెచ్చాం. కాపులకు రిజర్వేషన్లు కల్పించాం. అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాం. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5వేల కోట్లు కేటాయించాం.

## అవినీతికి పాల్పడడమే కాంగ్రెస్ అజెండా

### రాయగడ్‌లో ఎన్నికల ప్రచారంలో మోదీ



రాయ్‌గఢ్: అవినీతికి పాల్పడడమే కాంగ్రెస్ పార్టీ అజెండా అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. అవినీతికి పాల్పడ్డవారికి ఆ పార్టీ సాయం చేస్తోందని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌గఢ్‌లో భారతీయ జనతా తరువాయి 2లో..

## లోక్‌సభలో రఫేల్ రగడ

### పార్లమెంట్‌లోనూ, కోర్టులోనూ స్పష్టతనిచ్చాం

### ఇంకా మాట్లాడటం సమయం వృథా

### సైన్యం, వైమానికి దళాన్ని రెచ్చగొట్టొద్దు

### కేంద్ర రక్షణమంత్రి నిర్మలా సీతారామన్



దిల్లీ: రఫేల్ ఒప్పందంలో లోక్‌సభలో మరోసారి రచ్చ జరిగింది. ఈ ఒప్పందంపై రక్షణశాఖకు వ్యతిరేకంగా ప్రధానమంత్రి కార్యాలయం ఫ్రాన్స్‌తో సమాంతరంగా చర్చలు జరిపిందంటూ ఓ జాతీయ మీడియా కథనం పేర్కొంది. ఈ కథనాన్ని తరువాయి 2లో..

## హోదా సాధిస్తాం

### అత్యధిక సీట్లు గెలుస్తాం..

### దీక్షల పేరుతో దుబారా ఖర్చు చేస్తున్నారు

### వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



హైదరాబాద్: ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఎవరిని మభ్యపెట్టాలని ప్రయత్ని స్తున్నారని వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నించారు. గతంలో ప్రత్యేక హోదా వద్దని, ప్యాకేజీ కావాలని చంద్రబాబు అడిగినట్లు ఆయన గుర్తుచేశారు. గత నాలుగున్నరేళ్లు ఏమీ చెయ్యని చంద్రబాబు ప్రజల డబ్బుతో ఢిల్లీలో పొరాటం చేయడమేంటని అన్నారు.

శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. విశాఖ రైల్వేజోన్, ప్రత్యేక హోదాపై ఢిల్లీ వెళ్లి ప్రధాని తరువాయి 2లో..

## ఏపీ మంత్రివర్గం కీలక నిర్ణయాలు

అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మంత్రివర్గం నిర్ణయాలను రాష్ట్ర మంత్రులు గంటా శ్రీనివాసరావు, కాల్వ శ్రీనివాసులు మీడియాకు వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భృతి 20 శాతం పెంచాలని, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి హెల్త్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.

అమరావతిలో జేఎన్‌టీయూ ఎక్స్‌టెన్షన్ కేంద్రం ఏర్పాటు చేయాలని, విజయనగరం వర్సిటీకి గురజాడ అప్పారావు పేరు పెట్టాలని మంత్రివర్గం నిర్ణయించిందని వెల్లడించారు.

రాష్ట్ర హక్కుల కోసం బాబ్లీకి వ్యతిరేకంగా పోరాడిన వారిపై కేసులు, ప్రత్యేక హోదా ఆందోళనలకు సంబంధించిన కేసులపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఏలూరు స్మార్ట్ సిటీ అంశం, అగ్రిగోల్డ్‌పై ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టు అభినందించడంపై చర్చించినట్లు వివరించారు. పలు జిల్లాల్లోని ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కోసం రూ.2వేల కోట్లు అవసరమని, ఈ నిధులను నాబార్డు నుంచి తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించిందని రాష్ట్ర మంత్రులు గంటా శ్రీనివాసరావు, కాల్వ శ్రీనివాసులుతెలిపారు.

## 21న తెలంగాణ ఐసెట్ నోటిఫికేషన్

### 23, 24 తేదీలలో పరీక్షలు .. జూన్ 13న ఫలితాలు

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి

హైదరాబాద్: ఈనెల 21న తెలంగాణ ఐసెట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. మార్చి 7 నుంచి ఐసెట్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. మే 6న దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు. మే 9న హాల్‌టికెట్లు జారీ చేయనున్నారు. మే 23, 24 తేదీల్లో తెలుగు రాష్ట్రాల్లో ఐసెట్ పరీక్ష నిర్వహించ నున్నట్లు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి తెలిపారు. 29న ప్రాథమిక కీ విడుదల చేస్తామని, జూన్ 13న ఫలితాలు వెల్లడించనున్నట్లు పాపిరెడ్డి చెప్పారు. 67 కేంద్రాల్లో పరీక్ష ఉంటుందని, తెలంగాణలో 12, ఆంధ్రప్రదేశ్‌లో 4 ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

## ఏపీ ఉద్యోగులకు తీపికబురు

### 20శాతం మధ్యంతర భృతి

*అమరావతి: ఏపీ ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురందించింది. 20శాతం మధ్యంత భృతి (ఐఆర్) ఇచ్చేందుకు మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అంగీకరించారు. దీనిపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చింది సంతోషంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారని చెప్పారు. దానికి తాము సంతోషంగా ఏపీ సచివాలయ సంఘం తరపున చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ, సంపూర్ణ సహకారం అందిస్తామని అన్నారు. కేంద్ర వైఖరికి నిరసనగా ఈనెల 11న ఢిల్లీలో సీఎం చేస్తున్న ధర్నాకు మద్ధతుగా ఏపీలో అన్ని ఉద్యోగ సంఘాల నేతలు భారీగా తరలివెళ్లి సంపూర్ణ మద్దతు తెలియజేస్తామన్నారు.*

## రఫేల్ వ్యవహారంలో దొంగ సాక్ష్యాలు చెల్లవు

### చౌకీదారే దొంగ అని ఇప్పుడు రుజువైంది

### ప్రధాని మోదీపై నిప్పులుచెరిగిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ



దిల్లీ: రాజకీయ వివాదానికి కేంద్ర బిందువుగా మారిన రఫేల్ ఒప్పందం అంశంపై మరోసారి విమర్శల దాడికి దిగారు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ. దిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్రప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రఫేల్‌పై ప్రధాని మోదీ అసత్యాలు చెబుతు న్నారని ఆరోపించారు. రఫేల్ ఒప్పందం విషయంలో ప్రధాన మంత్రి కార్యాలయం ఫ్రాన్స్‌తో సమాంతరంగా చర్చలు జరిపిందని తాజా నివేదికలో తేలిందన్నారు.

రఫేల్ ఒప్పందంలో పీఎంవో జోక్యంపై రక్షణశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేసిందంటూ ఓ జాతీయ మీడియా ప్రచురించిన కథనంతో మరోసారి రఫేల్ వేడి రాజుకుంది. రఫేల్ ఒప్పందం విషయంలో రక్షణశాఖ నిర్ణయాలకు భిన్నంగా పీఎం కార్యాలయం ప్రవర్తించింది. ఫ్రాన్స్‌తో సమాంతరంగా చర్చలు జరిపింది అని తరువాయి 2లో..




### హోదా కోసం ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దు

హైదరాబాద్: ప్రత్యేక హోదా కోసం ఎవరూ ప్రాణాలు తీసుకోవద్దని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంక టేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా కావాలంటూ కర్నూరు జిల్లా నంద్యాలలో న్యాయ వాది అనిల్ ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన

### ఎమ్మెల్యే కిడారి హత్య కేసులో

## మరొకరు అరెస్ట్

విశాఖపట్నం: అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు హత్య కేసులో మరొకరు అరెస్ట్ అయ్యారు. నిందితుడు డొండురు కిలోను ఒడిశా పోలీసులు అరెస్ట్ చేశారు. కొరాపుట్ జిల్లా పాడువా అటవీ ప్రాంతంలో అదుపులోకి తీసుకు న్నారు. డొండురుని ఎన్ఐఏ అధికారులకు అప్పగించారు.



## చేనేత కార్మికులకు సంక్షేమ పథకాల అమలుకు కృషి చేయాలి

### - జిల్లా కలెక్టర్ కె.భాస్కర్



విశాఖపట్నం : చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను వారికి అందించడానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలక్టర్ కె.భాస్కర్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరు చేనేత కార్మికుల సంక్షేమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం యార్న్ సబ్సిడీపై అందిస్తున్నదని ఈ సదుపాయాన్ని వినియోగించుకునేలా తగు చర్యలు చేపట్టాలని సహయ సంచాలకులు, పెద్ది రాజును ఆదేశించారు. వర్షాకాలంలో చేనేత కార్మికులకు అందజేసే భృతి నెలకు 2వేలు చొప్పున 523 కుటుంబాలకు మంజూరు, మరియు 100 యూనిట్లు వరకు ఉచిత కరెంటు అందించాలన్నారు.

వీరికి సంబంధించిన వివిధ ఇతర సం క్షేమ పథకాల అమలుకు పూర్తి స్థాయిలో తగు చర్యలు చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో జెసి 2 డా. ఎ. సిరి, ప్రాజెక్టు డైరక్టర్ డి ఆర్ డి ఎ. రామమోహన్, ప్రాజెక్టు డైరక్టర్ హౌసింగ్ ప్రసాద్, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎ పి ఇ పి డి పి ఎల్ తదితరులు హాజరయ్యారు.త

## నులిపురుగుల మందులు తప్పనిసరిగా వేసుకోవాలి



నులిపురుగుల మందులు వేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంనకు పురస్కరించుకొని శుక్రవారం నర్సీపట్నం సబ్ సెంటర్ పరిధి శివపురం, గచ్చపువీధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, ఐదు అంగన్వాడీలోని పిల్లలకు నులిపురుగుల మాత్రలు వేశారు. ఈ సందర్భంగా వేములపూడి పిహెచ్సి ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ నులిపురుగులు ఎలా వ్యాపిస్తాయి.

పిల్లల ఆరోగ్యంపై నులి పురుగుల సంక్రమణ యొక్క ప్రభావం, నిర్మూలన వలన ప్రయోజనాలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, శివపురం స్కూల్ హెచ్ఎం అప్పారావు, ఏఎన్ఎం చినతల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## న్యాయ విజ్ఞాన్ సదస్సు



భీమునిపట్నం : స్థానిక సిబియం ఎయిడెడ్ పాటసాలలో న్యాయ విజ్ఞాన్ సదస్సు కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంకు ముఖ్య అతిదులుగా డి.ఎల్.ఎస్.ఏ సెక్రటరీ మరియు సినియర్ సివిల్ జడ్జ్ దామోదర్,మరియు జిల్లా న్యాయవాదులు జే.వీరలక్ష్మి,ఎల్.వి. రమణి, బాగ్యలక్ష్మి లు హాజరు అయ్యారు.ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ ఎన్ ఏ.ఎల్ ఎస్ ఏ స్కీమ్స్ బాలలహక్కుల గురించి చాలా విపులంగా విద్యార్థులకు తెలిపారు. అలాగే విద్యార్థులు ప్రదర్శన చేసిన నృత్యం బాలకార్మికులు, గృహహింస బాధితులు,నేటి కాలం రైతుల పరిస్థితులునాటికలు అతిదులను అలరించాయి. పాటసాల కరస్పాండెంట్ విజయకుమారి మాట్లాడుతూ లీగల్ లేటరేసి క్లబ్ ను వినియోగించుకొని చట్టాల పై అవగాహన కలిగి వుండాలని మంచి క్రమశిక్షణ తో ఉత్తమ పౌరులు గా ఎదగాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం లో లోక్ అదాలత్ సభ్యులు మరియు పాటశాల యజమాన్య ప్రతినిధి పి.ఎస్ చందు, పాటసాల కరస్పాండెంట్ నారాయణమూర్తి రాజు,తెలుగుటిచర్ డొప్పు.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వుయ్ కేర్ యు సంస్థకు కేరెజ్‌లువితరణ



భీమునిపట్నం : తగరపువలస వాస్తవ్యులు ఉంగరాల రెడ్డి నూతన వ్యాపారం ఎస్.వి.ఆర్ మార్ట్ ప్రారంభమైన శుభ సంధర్భంగ వుయ్ కేర్ యు సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు దృష్టిలో పెట్టుకొని ఈ మధ్య కాలంలో డి. సి. ఆర్. సేవారథం లో మిగులు భోజనమును తీసుకొని వెళ్ళడానికి వీలుగ సంస్థ కు 6000/- విలువ చేసే ఒక కేరెజ్ బహుకరించారు వీరుతో పాటు కొత్తా రామక్రిష్ణ ,( సిటీ కేబుల్ రామక్రిష్ణ ) మరియు దేవి స్వీట్స్ వారు కూడా ఇటువంటి కేరెజ్ లు ఇచ్చినంధుకు సంస్థ తరుపున వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో రామక్రిష్ణ రెడ్డి కుటుంబ సభ్యులు, వుయ్ కేర్ యు సంస్థ సభ్యులు వేంపాడ శ్రీనివాసరెడ్డి తధీతరులు పాల్గొన్నారు.

## వైకుంఠనారాయణునికి ప్రత్యేక పూజలు

విజయనగరం: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ నారాయణునికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు గావించారు. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం దేవాలయం అర్చకులు చాణక్య ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ ప్రధాన అర్చకులు చాణక్య ఆధ్వర్యంలో వైకుంఠనారాయణునికి స్నపనము, అర్చన, పంచామృతాభిషేకాలు చేసారు. ఈ ఉత్సవంలో ఎన్ సి ఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, చంద్రకళ, సిఇఓ టిఎల్ఎన్ మూర్తి, పరిపాలనాధికారి ఉమామహేశ్వరరావు, ఎం వి రమణ, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ పాలక వర్గం సమావేశం

భీమునిపట్నం : భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం సమావేశం శుక్రవారం ఉదయం మార్కెట్ కమిటీ చైర్మన్ కోరాడ.నాగభూషణ రావు అద్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమిలి, పద్మనాభం,ఆనందపురం మండలముల అభివృద్ధి కొరకు చర్చించారు. భీమిలి మార్కెట్ కమిటీ యార్డ్ లో ప్రహరీ గోడ నిర్మాణం కొరకు 18 లక్షలు మరియు పద్మనాభం సబ్ మార్కెట్ యార్డు చుట్టూ ప్రహారి గోడ నిర్మాణం కొరకు 8.25 లక్షలు వెరసి మొత్తం 26.25 లక్షలు బడ్జెట్ మంజూరు అయినదని మరియు ఈ నిర్మాణాలు మొదలు పెట్టి ఇప్పుడు పూర్తి అవుతున్నాయని, అలాగే ఇటీవల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం హుదుద్ లో పూర్తిగా పాడై పోయినందున ఆ కార్యాలయం స్థానం లోనే కొత్త భవనం నిర్మాణంకు గాను 50 లక్షల రూపాయులతో ప్రతి పాదనలను తయారు చేసి కమీషనర్ కు మరియు వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులకు పంపామని ఆ బడ్జెట్ రాగానే టెండర్లు పక్రియలు పూర్తి చేసినిర్మాణాలు చేపెడతామని తెలిపారు. తగరపువలస లో నిర్మాణం చేయుదలచి రైతు బజారు స్థలమును మార్కెట్ కమిటీ కీ అప్పగిస్తే 50 లక్షల మార్కెట్ కమిటీ నిధులతో రైతు బజార్ నిర్మించుటకు తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.అలాగే పద్మనాభం సబ్ మార్కెట్ యార్డులో పాడైపోయినటువంటి రెండు గోదాములు స్థానముల లోని ఎన్.ఆర్.జీ.ఎస్. ఫండ్స్ తో 500 మెట్రిక్ టన్నుల కెపాసిటి గల గోదాములు నిర్మించుటకు ప్రతి పాదనములు పంపామని అన్నారు. భీమిలి లో నిర్మిస్తున్న 2000 మెట్రిక్ టన్నుల గోదాము పూర్తి అయిందని దానిని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

ఈ కార్యక్రమం లో కార్యాలయం కార్యదర్శి వి.రామకృష్ణ, పాలక వర్గ వైస్ చైర్మన్ గొర్రిపాటి.పెద ఎర్రినాయుడు, సభ్యులు సిహెచ్. కుమార్,అల్లు చిన్నయ్య, ఎస్.సత్యరాజు,కె.రెడ్డి బాబు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శిగా : దాడి సత్యనారాయణ



ములగాడ: పారిశ్రామిక ప్రాంతం 49 వ వార్డు చెందిన మాజీ డిప్యూటీ మేయర్ పదవులు చేపట్టిన దాడి సత్యనారాయణకు వైయస్సార్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆయన చేసిన సేవలను గుర్తించి శుక్రవారం రాష్ట్ర అదనపు కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు ఈ విషయమై నగరంలోగల వైసిపి కార్యాలయంలో వైఎస్ఆర్ సీపీ నగర అధ్యక్షులు మళ్ల విజయప్రసాద్ అధ్యక్షతన వై ఎస్ ఆర్ సి పి నాయకుల మధ్య దాడి సత్యనారాయణకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు దాడి సత్యనారాయణ మళ్ల విజయప్రసాద్ కు కృతజ్ఞతలు తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ నా మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు పిల్ల కన్నబాబు జియ్యాని పిలా అనంత్ శ్రీధర్ బల్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## 59వ రోజుకు చేరిన సీతారాం దీక్షలు



అనకాపల్లి : అనకాపల్లి మండలం టి. వెంకుపాలెం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 67,68 లో గల భూమిలో సాగు రైతులకు పరిహారం చెల్లించాకే భూములు సేకరించాలనే డిమాండ్ తో జనసేన పార్టీ నియోజకవర్గ నాయ కులు కొణతాల సీతారాం చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి విజయవాడలో 59 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మీడియాను ఉద్దేశించి మాట్లాడిన సీతారాం రైతు లకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. టి. వెంకుపాలెం రైతులకు న్యాయం చేయాలనే డిమాండ్ తో ఇన్ని రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం చీమకుట్టినట్టు కూడా స్పందించక పోవడం దారుణమన్నారు. శాంతియుత దీక్షలు, నిరసనలకు దిగివచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేక పోతే ప్రభుత్వం మెడలు వంచి న్యాయం ఎలా సాధించుకోవాలో తమకు తెలుసన్నారు. సుమారు వంద ఎకరాల భూమిని ఎలాంటి పరిహారం ఇవ్వకుండా భూములు సేకరించడానికి పూనుకుంటే సహించేది లేదన్నారు. రైతులకు ఎకరాకు పది లక్షల రూపాయల పరిహారం ఇచ్చి తీరాలన్నారు. అలాగే ఎమ్మెల్యే పీలా గోవిందు దురాగతాలపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ ఉమర్, ఉత్తాడ రామరాజు, దాడి బుజ్జి, సురభి హరీష్, గల్లా వినోద్, పాము పైడిరాజు, రైతులు ఉరుకూటి సింహాద్రి, ఉరుకూటి అప్పారావు, భరణికాన ముత్యాలు, భరణికాన శేషు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## చెప్పినదానికంటే ఎక్కువే అమలు చేశాం

వృద్ధులు, వితంతువులను పూర్తిగా ఆదుకుంటున్నాం. ఆటోలపై జీవితకాలపు పన్ను, ట్రాక్టర్లపై త్రైమాసిక పన్ను మినహాయించాం.

గోదావరి జలాలలను కృష్ణా ఆయకట్టుకు మళ్లించాం. ఏలేరు ఆయకట్టుకు నీటి సమస్య లేకుండా చేశాం. రైతులకు 12వేల ట్రాక్టర్లు రాయితీపై అందించాం. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఇంటికి 2 ఎల్ఈడీ బల్బులు అందించాం. వారికి 100 యూనిట్ల లోపు వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. ప్రభుత్వ, ఆర్టీసీ ఉద్యోగులకు 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చాం. అగ్రవర్ణాల్లో పేదలకు రిజర్వేషన్లలో 5 శాతం కాపులకు కేటాయించాం. నేను తొలిసారి సీఎం అయినప్పుడు విజన్ 2020 తీసుకొస్తే కొందరు హేళన చేశారు. కానీ, తద్వారానే హైదరాబాద్ అభివృద్ధి జరిగింది. 2029 నాటికి ఏపీ లక్ష కోట్ల జీడీపీకి చేరాలన్నదే నా లక్ష్యం అని చంద్రబాబు వివరించారు. దీంతో పార్లమెంటు సమావేశాలు ముగిశాయి.

## హోదా సాధిస్తాం.. అత్యధిక సీట్లు గెలుస్తాం..

మోదీని ఏనాడైనా నిలదీశారా అని ప్రశ్నించారు. పాత బకాయిలు కట్టాలని ఎన్టీపీసీ నోటీసులు ఇచ్చిందినీ, రాష్ట్రం దివాళా తీసే పరిస్థితికి చంద్రబాబు తీసుకువచ్చారని సుబ్బారెడ్డి మండిపడ్డారు. ప్రజా అవసరాలకు డబ్బు ఖర్చుపెట్టకుండా దీక్షల పేరుతో దుబారా ఖర్చుకు పాల్పడుతున్నారని విమర్శించారు. పార్టీ కార్యక్రమాల కోసం ప్రజల డబ్బును దోచేస్తున్నారని ఆయన ఆరోపించారు.

టీడీపీ నేతలకు దోచిపెట్టడానికే ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రచార కార్యక్రమాలకే 3 లక్షల కోట్లు దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో ప్రజలే చంద్రబాబుకు బుద్ధిచెప్తారని, వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాలకు సొంతం చేసుకుని ప్రత్యేక హోదాను సాధిస్తామని స్పష్టంచేశారు.

## అవినీతికి పాల్పడడమే కాంగ్రెస్ అజెండా

పార్టీ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)ని రాష్ట్రంలో అడుగుపెట్టనివ్వబోమని అంటోంది. అలాగే, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్యారోగ్య పథకాలు ఈ రాష్ట్రానికి వద్దని చెబుతోంది. ఛత్తీస్‌గఢ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మేం కూడా వారికి అభినందనలు తెలిపాం. రాష్ట్రాభివృద్ధి కోసం వారు కూడా కొన్ని మంచి పనులు చేస్తారని అనుకున్నాం. కానీ, కేంద్ర సర్కారు అందిస్తున్న పథకాల ప్రయోజనాలు అందకుండా చేయడమే వారి పనిగా మారింది అని మోదీ విమర్శించారు.

నేను వారిని ఓ ప్రశ్న అడగాలనుకుంటున్నాను. మీకు ఉన్న సమస్య ఏంటి? పేద ప్రజలు నాకు మద్దతు తెలుపుతున్నారని కాంగ్రెస్‌కి తెలుసు. అందుకే, వారు ఇటువంటి పనులు చేస్తున్నారు. కాంగ్రెస్‌కి ఓ విషయాన్ని గుర్తు చేయాలని అనుకుంటున్నాను. మీరు దేశాన్ని 55 ఏళ్ల పాటు పాలించి నాశనం చేశారు. మేం పేద ప్రజల్లో ఆశలు చిగురింప చేసి వారి సమస్యల నివారణ కోసం పని చేస్తున్నాం. పేదరికంపై ప్రజలు పోరాడి సాధికారత సాధించేలా చేశాం. సీబీఐ వంటి వ్యవస్థలను ఈ రాష్ట్రంలో లేకుండా చేస్తున్నారు. ఎందుకంటే తాము అధికారంలో ఉన్న ఈ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ తమ అవినీతి ఖజానాకు ఏటీఎంలా వినియోగించుకోవాలనుకుంటోంది అని మోదీ వ్యాఖ్యానించారు.

నాపై విమర్శలు చేసే పనిలో కాంగ్రెస్ నేతలు పోటీ పడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మోదీ-మోదీ అంటూ నా నామ జపమే చేస్తున్నారు. అవినీతికి పాల్పడడం... అవినీతికి పాల్పడేవారికి సాయం చేయడమే వారి అజెండా. నేనో విషయం చెప్పదలుచుకున్నాను. ఈ కాపలాదారుడు పూర్తిగా అప్రమత్తంగా ఉన్నాడు. రైతులను కాంగ్రెస్ తమ ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తుంది. రైతు రుణమాఫీ అంటూ మభ్యపెడుతోంది. మీలో ఎవరికైనా రుణమాఫీ జరిగిందా? భారతీయ జనతా పార్టీ ఎన్నికల కోసం పథకాలు ప్రవేశపెట్టబోదు. రైతుల సమస్యలు పరిష్కరించాలనే ఆలోచిస్తుంది. మా ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తోంది. బడ్జెట్‌లో రైతులు, పేదల కోసం బడ్జెట్‌లో పలు పథకాలు ప్రవేశపెట్టింది. ఈ కాపలాదారుడు మీ కోసమే పనిచేస్తాడు. ఎందుకంటే మీరు సమర్థమైన ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. అవినీతి పార్టీలు, నేతలు కలిసి భాజపాను ఓడించాలని కలుస్తున్నాయి. మీరు ఆ ప్రతికూల శక్తులను ఓడించాల్సి ఉంది. ఆ పార్టీలు దేశంలోని ప్రజాస్వామ్యాన్ని అవినీతిమయం చేస్తాయి అని మోదీ అన్నారు.

## లోక్‌సభలో రఫేల్ రగడ

ప్రస్తావిస్తూ ప్రతిపక్ష ఎంపీలు కేంద్రంపై ధ్వజమెత్తారు. రఫేల్‌పై జాయింట్ పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు చేపట్టాలంటూ డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల ఆరోపణలను రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ అదే స్థాయిలో తిప్పికొట్టారు. రఫేల్‌పై తాము చెప్పాల్సిందంతా చెప్పేశామని, దీనిపై ఇంకా మాట్లాడటం సమయం వృథా అని అన్నారు.

రఫేల్ ఒప్పందంపై మీడియాలో వస్తున్న వార్తలన్నీ అవాస్తవం. పీఎంవో సమీక్షను జోక్యం చేసుకోవడం అని చెప్పలేం. రక్షణశాఖ నివేదికకు అప్పటి రక్షణమంత్రి మనోహర్ పారికర్ వివరణ ఇచ్చారు. దాని గురించి మీడియా ఎక్కడా చెప్పలేదు. ఒప్పందం విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అంతా సవ్యంగా జరిగింది. దీనిపై మేం ఇటు పార్లమెంట్‌లోనూ అటు కోర్టులోనూ స్పష్టతనిచ్చాం. ఇంకా దీనిపై మాట్లాడటం సమయం వృథా అని నిర్మలా సీతారామన్ దీటుగా బదులిచ్చారు.

కాంగ్రెస్ కావాలనే ఇలాంటి ఆరోపణలు చేస్తోందని, సైన్యం, వైమానిక దళాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆమె దుయ్యబట్టారు. ఇది చాలా ప్రమాదకరమన్నారు. మల్టీనేషనల్ కంపెనీల చేతుల్లో ప్రతిపక్షం కీలుబొమ్మలా మారిందని ఎద్దేవా చేశారు.

## రఫేల్ వ్యవహారంలో దొంగ సాక్ష్యాలు చెల్లవు

నవంబరు 24, 2015న రక్షణశాఖ ఓ నివేదికలో పేర్కొన్నట్లు ఆ కథనం తెలిపింది. ఈ కథనాన్ని ప్రస్తావిస్తూ రాహుల్ కేంద్రప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రక్షణశాఖకు వ్యతిరేకంగా ఫ్రాన్స్‌తో పీఎంవో నేరుగా చర్చలు జరిపింది. ఈ చర్చలు మీకోసమో, నా కోసమో కాదు.. అనిల్ అంబానీ కోసం. దీనిపై రక్షణశాఖ అభ్యంతరం చెప్పినట్లు తాజా నివేదిక పేర్కొంది. దీన్ని బట్టి చౌకీదారే దొంగ అని రుజువైంది. రఫేల్ కుంభకోణంలో ప్రధాని మోదీ ప్రత్యక్ష పాత్ర ఉందని గత ఏడాది కాలంగా మేం చెబుతూనే ఉన్నాం. శుక్రవారం దానిపై మరింత స్పష్టత వచ్చింది అని రాహుల్ ఆరోపించారు.

కాగా.. నిన్న లోక్‌సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ రఫేల్ అంశాన్ని ప్రస్తావించిన విషయం తెలిసిందే. రఫేల్‌పై పదే పదే అంత విశ్వాసంగా వారు అబద్ధాలు ఎలా చెప్పగలుగుతున్నారని నేను ఆశ్చర్యపోయా. కానీ నాకు ఇప్పుడు అర్థమైంది.. వారు అధికారంలో ఉన్న సమయంలో నిజాయతీగా ఒక్క రక్షణ ఒప్పందం కూడా చేసుకోలేదు. మామలు, బాబాయిలు మధ్యలో ఉన్నారు అని మోదీ కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు.

రఫేల్ ఒప్పందంపై ప్రధాని మోదీ రూ. 30వేల కోట్లను అనిల్ అంబానీకి దోచిపెట్టారని, మోదీ ప్రభుత్వం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తుందని రాహుల్ ధ్వజమెత్తారు. రఫేల్‌పై కేంద్రం సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు.

## హోదా కోసం ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దు

మాట్లాడుతూ... హోదా కోసం ఎవరూ సూసైడ్ చేసుకోవద్దని కోరారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ..అధికారం కోసమే చంద్రబాబు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు.

ఢిల్లీలో ధర్మపోరాటం యాత్ర చేయాలనే ఆలోచన చంద్రబాబుకు నాలుగేళ్ల తొమ్మిది నెలల తర్వాత వచ్చిందంటూ ఎద్దేవా చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్ సీపీ మొదటి నుంచి పోరాడుతుందన్నారు. రాజకీయ లబ్ది కోసం చంద్రబాబు యూటర్న్ తీసుకున్నారని ధ్వజమెత్తారు. ప్రత్యేక హోదాపై చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదని, ఢిల్లీ దీక్షకు జనాలను తరలించేందుకు అధికారులకు టార్గెట్‌లు పెట్టారన్నారు. నాడు హోదా అని ఉద్యమిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు పెడతానని హెచ్చరించిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ప్రభుత్వ డబ్బుతో దుబారా దీక్ష చేయబోతున్నారని విమర్శించారు.

## కేంద్రం మెడల్స్ ఊడలాక్కుంటే బంగభూషణ్ అవార్డులు మేమిస్తాం

### పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

కోల్‌కతా: కేంద్రంతో అమీతుమీ తేల్చుకునే విషయంలో వెనుకంజ వేసే ప్రసక్తే లేదని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి తేల్చిచెప్పారు. ఇటీవల మమతా బెనర్జీ చేపట్టిన ధర్నాలో పాల్గొన్న ఐదుగురు పశ్చిమబెంగాల్ సీనియర్ పోలీసు అధికారులపై కేంద్రం చర్యలు తీసుకునే ఆలోచనలో ఉన్నట్టు వస్తున్న వార్తలపై ఆమె ఘాటుగా స్పందించారు. పోలీసు అధికారులకు ఇచ్చిన మెడల్స్‌ను కేంద్రం వెనక్కి తీసుకుంటే రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత అవార్డులతో వారిని తాము గౌరవిస్తామని మమత చెప్పారు. 'ఇచ్చిన మెడల్స్‌ని కేంద్రం వెనక్కి తీసుకుంటే రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత పురస్కారమైన 'బంగభూషణ్' అవార్డులు ఇచ్చి మేము వారిని సత్కరిస్తాం' అని బెంగాల్ బిజినెస్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన మమతా బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.

ముఖ్యమంత్రి చంద్రబాబును

# అధిక మెజార్టీతో గెలిపించండి

రాష్ట్ర గొర్రెల మేకల ఫెడరేషన్ డైరెక్టర్ గంకల అప్పారావు



కంచరపాలెం: శుక్ర వారం ఉదయం 37వ వార్డు పరిధిలో గల ఇందిరానగర్ -1 గ్రామం నందు మన రాష్ట్ర ముఖ్యమంత్రి పసుపుకుంకుమగా ధన్ ఫౌండేషన్ మహిళా పొదుపు సంఘాల మహిళలకు అందజేశారు చెక్కులు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా 37వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మరియు రాష్ట్ర గొర్రెల మేకల ఫెడరేషన్ డైరెక్టర్ గంకల అప్పారావు విచ్చేసారు .మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పూలాభిషేకం చేశారు. అనంతరం ధన్ ఫౌండేషన్‌లో గల 11 మహిళా సంఘాలు వారికీ ఎప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం నుండి అండగా ఉంటున్నందుకు గాను 37వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మరియు రాష్ట్ర గొర్రెల మేకల ఫెడరేషన్ డైరెక్టర్ గంకల అప్పారావుకు సన్మానం చేసారు . అలాగే వార్డులో పింఛన్లు మంజూరు చేయించినందుకు సంతోషంతో పింఛనుదారులంతా కేక్ కటింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్క చెల్లెలు సంతోషంగా ఉండాలి , వారితో పాటుగా ఇంటిలో ఉన్న పెద్ద దిక్కు కూడా ఆనందంగా ఉండాలి అని 2000 /- పింఛను ఇచ్చి ఆదుకుంటున్నారు . కాబట్టి ప్రజలందరూ సంతోషంగా నిండుమనస్సుతో ఆయన్ని ఆశీర్వదించి రాబోయే ఎన్నికలలో భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు.

# నేడు 'పది' మోడల్ టెస్టు

యలమంచిలి రూరల్: యలమంచిలి రైల్వేస్టేషన్ రోడ్డు ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్టు నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వై.అప్పలరాజు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ పరీక్షను ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు జరుగుతుందని తెలిపారు. ఈ మోడల్ పరీక్షను పది విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పారితోషికం

యలమంచిలి రూరల్: వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఏటా నగదు పారితోషికం అందించనున్నట్టు మైహోం సిమెంట్ కర్మాగారం వైస్ ప్రెసిడెంట్ విహెచ్.చౌదరి తెలిపారు. కొక్కిరాపల్లి సాంఘిక సంక్షేమశాఖ బాలయోగి గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు పారితోషికం అందజేశారు. ఈ పాఠశాలలో 2016-2017, 2017-2018 విద్యా సంవత్సరంలో 8, 9 తరగతులలో అత్యధిక మార్కులు సాధించిన పి.నరసమ్మ, ఇ.సలోమి, కె.మౌనికలకు ఒక్కొక్కరికి రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు ప్రోత్సహకారాలు అందించారు. గురుకుల పాఠశాల హెచ్ఎం ఆర్‌వి.కృష్ణతార, మైహోం కర్మాగారం డిజిఎం ఎల్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు కె.నందిని, పి.రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సేవకే నా జీవితం అంకితం

అరకు : అరకులోయ మన్యంలో నేటికి అభివృధి చెందని గ్రామాలు ఎన్నో ఉన్నాయి అలగే అభివృధికి ఏ మాత్రం కుడా నోచుకోని గ్రామలూ ఆమడదూరంలో ఉన్నాయి, అయిన ప్రభుత్వం చూసి చూడనట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యావహారించడం చాల బాదకర విషయం అని అరకులోయ నియోజక వర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పాచిపెంట.శాంతకుమారి పత్రికల వారి సమక్షంలో అన్నారు. మన దేశం మన రాష్ట్రం అభివృధి చెందా లంటే దేశంలో రాహూల్ గాంధీ రాజ్యం కావాలి రాష్ట్రంలో కాంగ్రెస్ రాజ్యం కావాలి అని అన్నారు. అలగే నేను విశాఖ మన్యం అరకు లోయలో శాసన సభ్యులుగా గెలిస్తే మన్యంలో ప్రతి పేదోడికి కూడు గుడ్డ ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం, వృద్దులకు బారిగా పెన్షన్ అన్ని మన్యం గ్రామాల్లో అనేకం పథాకాలు ముందుకు తెగలననీ పత్రికల వారి ముందు తెలిపారు.

# ఘనంగా వనదుర్గమ్మవారి ఆలయంలో చండీ హోమం

అన్నవరం.....తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వనదేవతగా పూజలు అందుకొంటున్న వనదుర్గమ్మవారి గుడిలో శుక్రవారం ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ఉదయం 9గం.లకు విఘ్నేశ్వరుని పూజా, పుణ్యవచనం అమ్మవారికి మూల,మంత్ర జపములు చండీ సప్తపతి పారాయణములు నిర్వహించారు. 11గం.లకు పూర్ణహుతి గావించారు. పూజా కార్యక్రమాలు చల్లపల్లి. ప్రసాద్ శర్మ, కోంపెల్ల. మూర్తి కుచిబోట్ల. ప్రసాద్ మరియు వేదపండితులు, అర్చకులు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఈవో వీ.త్రినాథరావు, ఏసి ఈరంకి జగన్నాధరావు, చైర్మన్ రోహిత్, ఆలయ సిబ్బంది, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. వేదపండితుల వేదాశీస్సులు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసారు.

# హౌసింగ్ ఏఈగా గౌతమ్

రోలుగుంట: మండల హౌసింగ్ ఏఈగా గౌతమ్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఏఈగా పని చేస్తున్న దామోదర్‌ని ఇక్కడ నుంచి యలమంచిలికి గతంలో బదిలీ చేశారు. అయినప్పటికీ ఇప్పటి వరకూ ఇక్కడ అవసరం మేరకు ఇక్కడ విధుల్లో ఉంచారు. తాజాగా ప్రస్తుత కలెక్టర్ భాస్కర్ గౌతమ్‌కు ఏఈగా నియామక ఉత్తర్వులు పంపించారు. ఈ సందర్భంగా విధుల్లో చేరిన గౌతమ్ మాట్లాడుతూ మండలంలో ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానన్నారు. ఈ నెల 9న ప్రభుత్వ ఆదేశాల మేరకు సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు.

# కమిటీ పాలకవర్గం గడువు పొడిగింపు

నర్సీపట్నం: నర్సీపట్నం మార్కెట్ కమిటీ పాలకవర్గం గడువుని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రస్తుతం మార్కెట్ కమిటీ చైర్మన్ అడిగర్ల అప్పలనాయుడు ఏడాదిన్నరగా ఈ కమిటీ పని చేస్తోంది. ఇప్పటికే ఒకసారి గడువు పొడిగించగా మళ్లీ మరో ఆరు నెలలు పొడిగించడం గమనార్హం. మంత్రి అయ్యన్నపాత్రుడు సిఫార్సు మేరకు ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలుస్తోంది.

# ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గొలుగొండ: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు(బాలురు) ఆన్‌లైన్‌లో గానీ, పాఠశాల పనివేళల్లో నేరుగా దరఖాస్తులు అందించాలని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డి.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 80 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిలో 60 సీట్లు ఎస్సీలకు, తొమ్మిది సీట్లు బిసిలకు, ఐదు సీట్లు ఎస్టీలకు, బిసిలకు 4 ఒసిలకు 2 కేటాయించారన్నారు. ప్రవేశం కోరేవారు గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగో తరగతి చదువుతూ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. సంవత్సర ఆదాయం లక్ష రూపాయలకుమించరాదన్నారు. ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తులు అందించాలన్నారు. తక్షణం హాల్ టికెట్ విద్యార్థికి అందిస్తామన్నారు. మార్చి 15 తేదీన గురుకుల కళాశాలలో ఉదయం 11 గంటలకు పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

# జర్నలిస్టులు సామాజిక ఇంజనీర్లు

- స్వాతంత్ర్య పోరాటంలో పాత్రికేయుల పాత ఎనలేనిది
- ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం జడ్జి వెంకటరమణరాయలు



విశాఖపట్నం: జర్నలిస్టులు సామాజిక ఇంజనీర్లని, వ్యవస్థలో ఉన్న అనేక సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వాటిని పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తుంటారని అవినీతి నిరోధ (ఏసీబీ) ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి వెంకటరమణ రాయలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు నేషనల్ అలియన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ జాతీయ కార్యదర్శిగా నియమితులైన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ మహా విశాఖ నగర శాఖ శుక్రవారం సీతమ్మధారలోని నార్ల వెంకటేశ్వరరావు భవన్‌లో ఆయనకు ఆత్మీయ సత్కారం చేసింది. ఈ సందర్భంగా జడ్జి వెంకటరమణ రాయలు మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజంలోని రుగ్మతలను గుర్తించి వాటి పరిష్కార మార్గాలను నిర్దేశిస్తారని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాత్రికేయులు నిర్వహించిన పాత్ర ప్రశంసనీయమైందని తెలిపారు. ఈ సమావేశంలో సన్మాన గ్రహీత, నేషనల్ అలియన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ జాతీయ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం ముందుంటుందని అన్నారు. ఎన్ఏజే నేషనల్ సెక్రటరీగా నియమితులైన నేపథ్యంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై మరింత బాధ్యత పెరిగిందని, ఆ దిశలో తాను పనిచేసి అందరి మెప్పును పొందే ప్రయత్నం చేస్తానని అన్నారు.

ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నగర శాఖ అధ్యక్షులు పి.నారాయణ్ అధ్యక్షత వహించగా కార్యక్రమాన్ని ఉద్దేశించి సీనియర్ జర్నలిస్టులు బులుసు ప్రభాకర శర్మ, ఎస్.ఎస్.శివశంకర్, జి.జనార్ధనరావు, గరికపాటి ఉమాకాంత్, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రవికుమార్, మధు, ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు, బ్రాడ్ కాస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కృష్ణవేణి తదితరులు ప్రసంగించారు. రూరల్, అర్బన్ జిల్లాకు చెందిన జర్నలిస్టులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని గంట్ల శ్రీనుబాబును గజమాల, దుశ్శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు సభ్యత్వ నమోదు, గుర్తింపు కార్డులు జారీ చేశారు.

# చెత్త బుట్టల పంపిణీ

రావికమతం: రావికమతం పంచాయతీ కార్యాలయంలో ఈవోపిఆర్‌డి మహేష్ తడి, పొడి చెత్త సేకరణకు ప్లాస్టిక్ డబ్బాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ మహిళలు ఇకపై ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా డబ్బాలో వేసి హరిత రాయబారులకు అందజేయాలని కోరారు. ఏ ఇంటి ముందు చెత్త ఉండరాదన్నారు. గ్రామంలో 2200 ఇళ్లకు గాను 500 మందికి తొట్టెలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# దాడి కేసులో ఏడాది జైలు

నర్సీపట్నం: ఒకరిపై దాడి చేసి గాయపరిచాడన్న నేరం రుజువు కావడంతో నీలంపేటకు చెందిన సింగంపల్లి శ్రీనివాసరావు(29)కు ఏడాది జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి యజ్ఞ నారాయణ తీర్పు ఇచ్చినట్లు నర్సీపట్నం రూరల్ ఎస్సై టి.శ్రీను తెలిపారు. 2015 డిసెంబరు 30న గొర్లె అప్పలనాయుడు(24) పై ట్రాక్టర్ గొట్టంతో దాడి చేసి తలపై గాయపర్చినట్టు శ్రీనివాసరావుపై కేసు నమోదైంది. దీనిపై ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ యాస్మిన్ సుల్తానా పోలీసుల తరపున వాదించారు.

# చిన్నారుల వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలి ...

ఐ .సి.డి.ఎస్. అర్బన్ -1 సూపర్ వైజర్ రాజేశ్వరి ..



కంచరపాలెం: చిన్నారుల వ్యక్తిగత శుభ్రతపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ఐ .సి.డి.ఎస్ . అర్బన్ -1 సూపర్ వైజర్ రాజేశ్వరి పెర్కొన్నారు . ఈమేరకు నులిపురుగులు దినోత్సవం సందర్భంగా జివిఎంసి 35వ వార్డు జేపి .నగర్ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఉదయం కేంద్రంలో చిన్నారులకు ఆల్బండెజ్ మాత్రలు అందజేశారు .ఈసందర్భంగా ఆమె మాట్లడుతూ చిన్నారులు ఆహార పదార్థాలు స్వీకరిస్తున్న సమయంలో చేతులు శుభ్ర పరిచుకునే విధంగా చూసుకోవాలని వివరించారు. చిన్నారుల శుభ్రతపై ఎప్పటికపుడు తల్లి దండ్రులకు అవగహన కల్పించాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు .
కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ మౌలా బీబీ , ఆయా పాపవేణి పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు .

# మహిళల సంక్షేమానికి అభివృద్ధికి చెక్కుల పంపిణీ



విశాఖ సిటీ: ఏపీ ప్రభుత్వం ఇటీవల పొదుపు సంఘాల మహిళలకు పసుపు-కుంకుమ క్రింద పది వేల రూపాయిలు పంపిణీలో భాగముగా మహిళల అభివృద్ధి, సంక్షేమం, సాధికారత దిశగా ముందుకు సాగాలని మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనకు అనుగుణముగా, విశాఖ దక్షిణ శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ సారథ్యంలో శుక్రవారం 25వ వార్డులోని వివిధ డ్వాక్రా సంఘాల సభ్యులకు వార్డు టీడీపీ అధికార ప్రతినిధి, జన్మభూమి కమిటీ సభ్యులు తిత్తి సాయిబలరాం ద్వారా చెక్కులు అందించడం జరిగింది, ఈ కార్యక్రమంలో పలువురు మహిళ లబ్దిదారులు పాల్గొని సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే వాసుపల్లికి జేజేలు పలికారు.

# పసుపు-కుంకుమ చెక్కుల పంపిణీ



విశాఖపట్నం: శుక్రవారం జీవీఎంసీ 28వ వార్డు, గౌరీ వీధి గౌరీ కమ్యూనిటీ హాల్‌లో 28వ వార్డ్ డ్వాక్రా మహిళా సంఘాలు ఆధ్వర్యంలో మా కుటుంబములో పెద్దన్నగా చంద్రన్న మహిళలకు పసుపు-కుంకుమ 2019 సంవత్సరము, ఆడపడుచులకు కళ్ళల్లో వెల్లివిరిసిన సంబరం, పుట్టింటి కానుకగా చంద్రన్న వరం, ప్రతీ సభ్యురాలుకి పది వేల ఆర్థిక సహకారం, అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి విల్లూరి డాక్టర్ చక్రవర్తి మరియు జీవీఎంసీ యు సి డి విభాగం సి ఓ వెంకటరత్నం మరియు 28వ వార్డు వివిధ మహిళా సంఘాల అధ్యక్షురాలు విల్లూరి తిరుమల దేవి చెక్కుల పంపిణీ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చక్రవర్తి మాట్లాడుతూ 28వ వార్డులో 250 మహిళా గ్రూపులు ఉండగా వీరికి రెండు కోట్ల 50 లక్షల రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు. వీటితో పాటు ఆడపడుచులకు, పసుపు కుంకుమ గాజులు ,స్వీటు హాటు , తాంబూలము , తేనీరు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సత్య, మాధవి, గైరమ్మ, ఫాతిమా, జ్యోతి, తులసి, పెక్కు మంది మహిళలు పాల్గొన్నారు.

# వీధికుక్కల స్వైరవిహారం

- కుక్కల బెడదతో బెంబేలెత్తుతున్న స్థానికులు
- పదికి చేరిన బాధితుల సంఖ్య
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



మధురవాడ: అది పీఎంపాలెంలోని గాయత్రినగర్ రోడ్ పిల్లలకైనా, పెద్దలకైనా చివరకి కండలు తిరిగిన యోధులైన అటుగా వెళ్లాలంటే గుండె దైర్యం కావలి ఇదేమిటి అక్కడ గుండాలు, దాదాలు, కరుడు కట్టిన నేరస్తులు ఉన్నారేమో అనుకుంటే పప్పులో కాలేసినట్టే. వివరాల్లోకి వెళితే.. జీవీఎంసీ 4వ వార్డ్ గాయత్రినగర్ కాలనిలో వీధికుక్కలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సమీపంలోని అపార్టుమెంట్లో నివాసం ఉంటున్న ప్రజలపై తరుచు దాడి చెయ్యడంతో ఆసుపత్రి పాలవుతున్నారు, గత కొంత కాలంగా వీధి లైట్లు లేక చీకటి వేళల్లో అటుగా వెళ్లాలంటే కుక్కలమూకు దాడి చేస్తాయేమోనని భయభ్రాంతులకు గురౌవుతున్నారు, మూడు రోజు క్రితం వర్రపదా విహార్ లో నివాసముంటున్న రాళ్ళపల్లి పద్మ అనే గృహిణి పై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి, అదే విధంగా 15 రోజుల క్రితం డి.వి.భాస్కర రాజు అనే విశ్రాంతి ఉద్యోగిపై దాడి చేసెయ్యి, ఇలా చెప్పుకొంటూపోతే అనేక మంది పిల్లలు,పెద్దలు వీటి బారిన పడిన భాదితులున్నారు. నడిచి వెళ్ళేవారిని టార్గెట్ చేస్తూ దాడిచేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, ఎన్నిసార్లు జీవీఎంసీ అధికారులకు ఆన్లైన్ ద్వారా మరియు నేరుగా పిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా అధికారులు వీటిపై ద్రుష్టి సారించి తగుచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# నాతవరం తహశీల్దార్‌కు బదిలీ

నాతవరం: నాతవరం తహశీల్దార్ కనకారావును విజయనగరం జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. అక్కడి నుంచి రెండు రోజుల్లో ఇక్కడకు మరొకరిని నియమిస్తారని తెలిసింది. త్వరలో ఎన్నికలకు రంగం సిద్ధం కావడంతో బదిలీ ప్రక్రియ ప్రారంభమైందని చెబుతున్నారు.

# గీతం ఐఇటిఇ విభాగం యువజనోత్సవం

సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి అనుబంధంగా గల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఇటిఇ) విద్యార్థి విభా గం ఆధ్వర్యంలో ఐ-స్క్వేర్ ఆర్ పేరిట జాతీయ స్థాయి యువసాంకేతిక ఉత్సవం శుక్రవారం ప్రారంభం అయింది. సమిర్ సంస్థ ప్రోగ్రామ్ డైరక్టర్ డాక్టర్ బి. సుబ్బారావు ముఖ్యఅతిధిగా హజరైన విద్యార్థులకు దిశానిర్ధేశం చేశారు.

గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అభ్యసించే వారు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్ధం చేసుకోవడం, వినూత్నంగా ఆలోచించడం అవసరమన్నారు. ఐఇటిఇ ఫ్యాకల్టీ సలహదారు ప్రొఫెసర్ పి.వి.వై. జయశ్రీ మాట్లాడుతూ సాంకేతిక యువజనోత్సవంలో భాగంగా సర్క్యూషన్ డిజైనింగ్, బ్లాక్‌చెయిన్, మెషిన్ లెర్నింగ్‌లపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యువ విజేత డాక్టర్ తేజస్విని మనోజ ప్రసంగం ఆకట్టుకుంది కె.కరుణకుమారి, పి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు 'కహనీ' పేరిట లఘుచిత్రాల పోటీని నిర్వహించారు.



# విజయభాను సంపాదకీయం

## ప్రమాదాన్ని గ్రహించాలి

ప్రపంచ దేశాలు మళ్ళా ప్రచ్ఛన్నయుద్ధం నాటి అనిశ్చిత పరిస్థితుల్లోకి అడుగుపెడుతున్న తరుణంలో అమెరికా మధ్యతరహా అణ్వస్త్ర (ఐఎన్ఎఫ్) నిర్మూలన ఒప్పందం నుంచి వైదొలుగడం, అమెరికా ప్రకటనకు దీటుగా రష్యా కూడా ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించడమే కాకుండా మరింత ఆధునిక క్షిపణులను రూపొందిస్తున్నట్టు వెల్లడించింది. ఒప్పంద నిబంధనల ప్రకారం- లాంఛనంగా వైదొలుగడానికి మరో ఆరు నెలలు పడుతుంది. కానీ రెండుదేశాల వైఖరిని గమనిస్తే, ఒప్పందం నిలిచే సూచనలు కనిపించడంలేదు. ఈ ఒప్పందంలో అమెరికా, రష్యా దేశాలు కొంతకాలంగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్టు పరస్పరం విమర్శించుకుంటున్నాయి. 1987 డిసెంబర్‌లో అమెరికా అధ్యక్షుడు రీగన్, సోవియెట్ అధినేత గోర్బచేవ్ మధ్య కుదిరిన ఈ ఒప్పందం మిగతా నిరాయుధీకరణ ఒప్పందాలకు దిక్సూచి వంటిది. దీనివల్ల యూరప్ దేశాల రాజధానులపై ఎక్కుపెట్టిన అణు క్షిపణులను సోవియెట్ యూనియన్ తొలిగించింది. అమెరికా కూడా తన క్షిపణులను ధ్వంసం చేసింది. కానీ వ్యూహాత్మకంగా ఈ క్షిపణులను ధ్వంసం చేసినప్పటికీ, మరింత ఆధునిక క్షిపణి వ్యవస్థల కోసం ఇరుపక్షాలు పరిశోధనలు సాగిస్తున్నాయి. ఇప్పుడు అత్యాధునిక క్షిపణి వ్యవస్థలను పరీక్షించి మోహరించడానికి ఏర్పాట్లు చేసుకున్నాయి. అయితే తాజా ఆయుధ పోటీ యూరప్ కన్నా ఆసియా- పసిఫిక్ ప్రాంతంలోనే ఎక్కువగా ఉంటుందని రక్షణ నిపుణులు అంటున్నారు.

ఐఎన్ఎఫ్ ఒప్పందం అమెరికా, రష్యా మధ్య కుదిరింది కనుక కొత్తగా ఎదుగుతున్న చైనాకు వర్తించదు. అందువల్ల తాము ఒప్పందం నుం చి వైదొలుగుతున్నామని కూడా అమెరికా అం టున్నది. కానీ చైనాతో చర్చలు జరిపి, ఆ దేశా న్ని ఒప్పందంలోకి తేవడానికి ప్రయత్నించాలే తప్ప, ఉన్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవడం పరిష్కారం కాదు. ఈ ఒప్పందం నుంచి అమెరికా వైదొలుగడం పట్ల ఆందోళన వెలిబుచ్చిన చైనా, ఇప్పటికైనా చర్చలు జరిపి పరిష్కారం సాధిద్దామనే అభిప్రాయాన్ని వ్యక్తంచేసింది. దీన్నిబట్టి చైనాతో కనీసం చర్చలు జరిపే పరిస్థితి ఉన్నదని తెలిసిపోతున్నది. ముఖ్యంగా తైవాన్ ప్రాంతంలో అమెరికా దాడులకు దిగితే తట్టుకోవడానికి ఏర్పాట్లు చేసుకుం టున్నది. ఈ వివాదం ఈశాన్య ఆసియా ప్రాంతానికే పరిమితమైనట్టు కనిపిస్తున్నప్పటికీ, అమెరికా- చైనా ఘర్షణ మొత్తం ఆసియా-పసిఫిక్ ప్రాంతమంతా విస్తరించి ఉన్నది. హిందు మహాసముద్ర ప్రాంతం కూడా ఇందు కు అతీతం కాదు. ఇక్కడే భారత్ అప్రమత్తం కావలసి ఉన్నది. దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలోని ఉద్రిక్తతలు మొత్తం హిందూ మహాసముద్ర ప్రాంతాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. భార త్ ఇటీవలికాలంలో అమెరికా ప్రోద్బలంతో దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో ప్రవేశిస్తున్నది. ఈ నేపథ్యంలో చైనాతో క్షిపణిరంగంలో పోటీపడాలని చూస్తున్న అమెరికా వైఖరిని గమనంలో కి తీసుకోవాలె. భవిష్యత్తులో అమెరికా- చైనా ఉద్రిక్తతలు ఏ మోతాదులో, ఏయే రూపాలలో ఉంటాయో, మన పాత్ర ఏమిటో విశ్లేషించుకోవాలె.

బుల్లెట్ మనుషులను చంపదు, ట్రిగర్‌ను నొక్కే వేలు చంపుతుంది అనేది ఒక జేమ్స్‌బాండ్ సినిమాలోని వ్యాఖ్య. ఆయుధాలనే కన్నా మనిషిలోని అసహనం, యుద్ధోన్మాదం ప్రపంచానికి ప్రమాదకరం. ఒక క్షిపణి ఒప్పందం నుంచి వైదొలుగడమే కాదు, అంతర్జాతీయ ఒప్పందాలు, కూటములు, మొత్తంగా సమష్టితత్వం పట్ల అమెరికా ప్రదర్శిస్తున్న అసహనం, దుందుడుకు వైఖరి భయాందోళనలను కలిగిస్తున్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే ఇరాన్ అణు కార్యక్రమాన్ని నియంత్రించే ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించారు. ఇరాన్ ఒప్పందం పట్ల యూరోపియన్ దేశాలు ప్రదర్శించిన సామరస్యాన్ని అమెరికా చూపలేకపోయింది. ట్రంప్ ఆసియా- పసిఫిక్ ఒప్పందం నుంచి కూడా ఇదేరీతిలో వైదొలిగారు. నాటోలో భాగస్వాములైన యూరప్ దేశాలు నిధులు ఇవ్వడంలేదంటూ అసహనం వ్యక్తంచేస్తున్నారు. ట్రంప్ ఆలోచనా ధోరిణికి ఆయన జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ మాటలు అద్దం పడుతుంటాయి. బోల్టన్‌కు ఆయుధ నియంత్రణ, అంతర్జాతీయ కూటములు, బహుళ పక్ష ఒప్పందాలు మొదలైనవేవీ నచ్చదు. చివరికి ఐక్యరాజ్యసమితి అంటే కూడా చిర్రెత్తుకొస్తుంది. ఇవన్నీ ఘనత వహించిన అమెరికా ప్రాబల్యా న్ని కట్టడి చేస్తున్నాయనేది ట్రంప్ బృందం బాధ. సరిహద్దులో గోడలు కట్టుకోవాలనే ఇటువంటి ఏకాకి మనస్తత్వం వల్ల అంతిమంగా అమెరికాకూ నష్టమే. అమెరికా ప్రజలు ఈ ప్రమాదాన్ని గ్రహించి కట్టడి చేయాలె.

## జనసేన పార్టీలోకి జన సైనికుడిగా పిలా రామకృష్ణ



ములగాడ: జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేస్తున్న రాజకీయ మార్పుల కోసం రానున్న రోజుల్లో ప్రజలకు నిజాయితీగా పాలన అందించే దిశగా అధినేత చేస్తున్న కృషికి జనసేన సైనికుడిలా నా వంతు బాధ్యతగా పనిచేస్తానని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పిలా రామకృష్ణ పిలుపునిచ్చారు శుక్రవారం ఉదయం గాజువాక జింక్ గేటు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ కార్యాలయంలో పత్రికా సమావేశం ఏర్పాటు చేసి ఆ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసేన పార్టీ లోకి చేరమని మా తండ్రిగారి కాంగ్రెస్ పార్టీ కి ఎన్నో సేవలు అందించారని ఆ సేవలు అన్నిటిని దృష్టిలో పెట్టుకుని మన పారిశ్రామి ప్రజలకు సేవలు అందించాలని దృఢ సంకల్పంతో పార్టీలో చేరానని జనసేన పార్టీ ఆశయాలు నన్ను ఎంతో ఆకట్టుకున్నాయి.

అని రానున్న రోజుల్లో రాజకీయ పక్షాలను కే పవన్ చేస్తున్న ప్రయత్నాలకు తోడుగా ఉంటానని ఇదేవిధంగా పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ అధినేతకు వివరించామని ముఖ్యంగా విద్య వైద్య విషయంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వైద్యం విషయంలో ప్రభుత్వ ఆసుపత్రులు పారిశ్రామిక ప్రాంతంలో కరువయ్యాయని ఉన్న రెండు ఆసుపత్రిలో రోగులకు సరైన వైద్యం అందక లేదని చాలా ఇబ్బందులు పడుతున్నారని విద్య విషయంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పించడం లేదని అధినేతకు వివరించామని దీనికి పవన్ సానుకూలంగా స్పందించారు ఈ నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్టానికి సీనియర్ నాయకులతో కలిసి పనిచేస్తూ పార్టీని ముందుకు తీసుకొని వెళ్తానని ఈ నేపథ్యంలో ఆదివారం 10 తేది జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం మరియు పార్టీ జెండా ఆవిష్కరణ చేసి జనసేన కార్యకర్తలతో భారీగా బైక్ ర్యాలీని కార్యాలయం వద్ద నుంచి సింధియా కూడలి వరకు ర్యాలీ సాగుతుందని ఆయన అన్నారు అనంతరం పిలా రామకృష్ణ తండ్రి పిలా నాయుడు మాట్లాడుతూ నా కుమారుడు పారిశ్రామిక ప్రాంత ప్రజలకు సేవ చేయాలని ఉన్న సంకల్పంతో ఉండడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు రాజు ప్రకాష్ అర్జున్ అన్నా లక్ష్మీనారాయణ కోటశ్రీను వెంకీ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల విద్యార్థులకు మాత్రలు పంపిణి



భీమునిపట్నం : జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం భీమిలి పి.హెచ్,సి ఆధ్వర్యంలో భీమిలి పరిసర ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండోజోల్ మాత్రలను భీమిలి ప్రభుత్వ ఆస్పత్రి ప్రదాన వైద్యులు దిద్దే .సిద్ధార్థ కుమార్ పిల్లలకు మాత్రలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయట చిల్లర తిండ్లు పరిమితి లేకుండా తినడం, అపరిశుభ్రంగా ఉండే ఆహారం తీసుకోవడం వలన సంభవిస్తుంది. ఇలాంటి సందర్భంలో నులిపురుగులను కంట్రోల్ చేయుటకు చిన్న పిల్లలకు ఏడాదిలో రెండుసార్లు డీ వామింగ్ మాత్రలను వేయడం ద్వారా ఆకలి పెరిగి చలాకీగా ఉంటారని అన్నారు. ఈ రోజు మాత్రలు వేసుకున్న వారు మళ్లీ ఈనెల 14 న మరలా ఇవ్వనున్నామని తెలిపారు. భీమిలి డివిజన్ టి.డి.పి.అద్యక్షులు గంటా. నూకరాజు మాట్లాడుతూ ఎలిమెంటరీ మరియు హైస్కూల్ స్టేజి లోనే పిల్లలకు ఎక్కువగా కడుపులో నులిపురుగులు అనేవి ఉంటాయని, దీని ద్వారా పిల్లలు సరిగా ఆహారం తీసుకోకపోవడం , నీరసంగా ఉండడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, కడుపులో నొప్పి, పిల్లలు చిరాకుగా ఉండడంతో పాటు ఎదుగుదల సరిగా ఉండదని. ఇలాంటి సమస్య ఎక్కువగా సామాన్య కుటుంబాల్లో బ్రతికేవారికి ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆశా వర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## డ్వాక్రా సంఘాల సభ్యులకు చెక్కులు పంపిణి



భీమునిపట్నం : భీమిలి డివిజన్ 27వ వార్డు సంగివలస లో డ్వాక్రా సంఘాల సబ్యులకు ఒక్కొక్కరికి 10,000/-లు చొప్పున 36 సంఘాలకు 36 లక్షల రూపాయలు మరియు దివ్యాశీగుల సంఘానికి 50వేల రూపాయలు భీమునిపట్నం తెలుగుదేశం పార్టీ డివిజన్ అద్యక్షులు గంటా నూకరాజు అందజేసారు. ఈ సంధర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా అవతరించిందని ఇటువంటి పథకాలు పెట్టడం ద్వారా మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. అంతేకాకుండా పదిరెట్లు పెంచిన పింఛన్లు, రాష్ట్రంలో ఉన్న 96 లక్షల మంది డ్వాక్రా మహిళలకు ఒక్కొక్కరికి 10,000/-లు చొప్పున నగదు మరియు స్మార్ట్ ఫోన్ ఆడపడుచులకు పసుపు - కుంకుమ లు కింద ఇస్తున్నట్లు మన ముఖ్యమంత్రి ప్రకటించడంతో ఆడపడుచుల ఆనందానికి అవధుల్లేకుండా పోయిందని . రాష్ట్రంలో ఉన్న దివ్యాశీగులు, వృద్దులు, వితంతువులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, ఒంటరి డప్పు కార్మికులు, గీత కార్మికులుతో పాటు యువనేస్తం కింద లబ్ధి పొందుచున్న నిరుద్యోగులు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు పొంది ఆనందంగా ఉన్నారని. గంటా నూకరాజు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ భీమిలి డివిజన్ లీగల్ సెల్ అద్యక్షులు చోడిపిల్లి సాయి, ప్రచార కార్యదర్శి ఊళ్ళ దుర్గారావు, జన్మభూమి కమిటీ సభ్యులు ఊళ్ళ నర్సింగరావు, చోడిపిల్లి రాంబాయి, యూ సి డి. సి. ఓ పాపారావు, రిసోర్స్ పర్సన్ కోనాడ. హేమలత తో పాటు డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

## సమకాలీనం (కవి సమయం)

### శ్రమయే దైవం

పల్లె, పేటలు మనవే...
ఏరు, దుక్కులు వనదే...
ఏమిరో... శ్రమించు నోళ్ళు;
పనులకు పోంద్రో...
కాడెద్దులుతోను
గరువును దున్ని
నాగలి పట్టి
సాలును పూసి
పారిన ఏరుకు గూడ
తారెలు తవ్వి తోవ
మీ చెమటే... జలము
మీ శ్రమయే... ఘనము
శ్రమతో కార్మిక-చలి చలి గున్న
శ్రమతో ధార్మిక-మండే యెండలు వున్న
ఎత్తిన బంగీ-దించిన బంగీ
ఓర్మితో శ్రమలే...
కార్ఖాన పనులే...
నలుదిక్కులులోను
నలుమూలలులోను,
శ్రమ పావనమే - కనిపిస్తుంది
ప్రపంచానికే-శ్రమయే మేలనిపిస్తుంది

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం:9290839512

## పంచాంగం

| మాసం : పుష్య; తిథి : చవితి ఉ.9.13; ఉత్తరాభాద్ర ప.2.41; రా.తె.వ.3.27ల 5.10. | శనివారం 09 -02 -2019 |
|---|---|

**మేషం** : బంధువులను కలుసుకుంటారు. స్త్రీలకు షాపింగ్‌లోనూ, వాహనం నడుపుతున్నపుడు ఏకాగ్రత ముఖ్యం. రావలసిన ధనం వసూలు విష యంలో శ్రమాధిక్యత, ప్రయాసలెదుర్కొంటారు. నూతన పరిచయాలు, వాతావరణం సంతృప్తి నిస్తాయి. **వృషభం** : బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కో వలసి వస్తుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు కలిసివస్తాయి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, ఒప్పందాల్లో మెలకువ వహించండి. **మిథునం** :స్త్రీలకు, గృహ వాతావరణం, సంతానం వైఖరి వల్ల చికాకులు తప్పవు. కళాకారులకు, క్రీడాకారులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం వల్ల పనులు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం మంచిది కాదు. **కర్కాటకం** :విదేశీ వస్తువుల పట్ల ఆకర్షితులవుతారు. ప్రముఖులను కలుసుకుంటారు. బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. మీ సంతానం ఉన్నతి కోసం కొత్తకొత్త పథ కాలు రూపొందిస్తారు. స్త్రీలలో ఒత్తిడి, హడావుడి అధికమవుతాయి. స్త్రీలకు నూతన వ్యక్తుల పరిచయం ఎంతో ఇబ్బంది కలిగిస్తుంది. **సింహం** : పోస్టల్, కొరియర్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమవుతుంది. నిరు ద్యోగులకు సదావకాశాలు లభించిన సద్వినియోగం చేసుకోలేరు. ఉపాధ్యా యులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. **కన్య** : కొంతమంది మీతో సన్నిహితంగా ఉంటూనే చాటుగా అపకారం తల పెట్టేందుకు యత్నిస్తారు. చిన్ననాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. స్థిరాస్తిని కొనుగోలుచేయు యత్నాలు ఫలిస్తాయి. పనులు మొదట్లో మందగించినా క్రమేపీ పూర్తికాగలవు. కుటుంబీకులతో దైవ దర్శనాలు చేసుకోగలగుతారు. **తుల** : కాంట్రాక్టర్లకు కార్మికులతో సఖ్యత నెలకొంటుంది. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. భాగస్వామి మాటతీరు, కదలికలను గమనించడం ఎంతైనా మంచిది. **వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది.



తూర్పు నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు శుక్రవారం జ్యోతి సినిమా హాలులో యాత్ర సినిమా సందర్భంగా నియోజకవర్గ శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఉదయం నుంచి జోహార్ వైస్సార్ అంటూ ఆ ప్రాంతం మారుమోగింది. వివిధ వార్డ్ లు నుంచి రాజశేఖర్ రెడ్డి అభిమానులు జగన్నన్న అభిమానులు హాజరయ్యారు. సినిమా చూసినంత సేపు రాజశేఖర్ రెడ్డి గుర్తుకు వచ్చారంటూ చాలా మంది అభిమానులు కంటతడి పెట్టుకున్నారు.

## ప్రజా సమస్యలపై ప్రతిపక్ష పాత్ర.. ఈ పాదయాత్ర

### వైయస్సార్ నేత మజ్జిశ్రీను

విజయనగరం: చరిత్రలో లేని విధంగా ప్రజాసంక్షేమం కోసం 14నెలలు పాటు 3650 కి॥మీ ॥ సుధీర్ఘ పాదయాత్ర చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వై.యస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర ఒక చారిత్రక ఘట్టంగా జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయవ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అభివర్ణించారు.మంగళవారం స్థానిక సత్యాకార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.14నెలలు క్రితం ఇడుపులపాయలో ప్రారంభమైన ప్రజాసంకల్పయాత్ర ఈ నెల 9న ఇచ్ఛాపురంలో ముగియనుందని ఆయన తెలిపారు. ఇచ్ఛాపురంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని రాష్ట్రం నలుమూలలనుండి పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీలు, పార్టీనాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున ఇచ్ఛాపురంనకు తరలి రానున్నట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లానుండి కూడా పార్టీ శ్రేణులు, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభిమానులు బహిరంగ సభకు విచ్చేయాలని ఆయన కోరారు. సెప్టెంబరు జిల్లాలో జరిగిన 9బహిరంగ సభలలోను, పాదయాత్రలోను 34మండలాలు, 4 పురపాలక సంఘాల పరిధిలోగల అన్నివర్గాల ప్రజలు పాల్గొని జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యలు చెప్పుకున్నారని తెలిపారు.దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి 2004లో నిర్వహించిన మహాప్రస్థానంలో పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకొని ఆయన అధికారంలోకి వచ్చినతరువాత అటువంటి సమస్యలన్నీ పరిష్కరించిన విధంగానే 2019 ఎన్నికలలో వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసమస్యలు పరిష్కరిస్తారని శ్రీనివాసరావు ప్రజలకు బరోసా ఇచ్చారు. నాలుగన్నరేళ్లుగా తెలుగు దేశం ప్రభుత్వం ప్రజలకు పెన్సన్లు, గృహాలు, రేషన్‌కార్డులు వంటివి అర్హులకు అందజేయ లేదన్నారు. నవరత్నాల కార్యక్రమం ద్వారా అన్నివర్గాల ప్రజలను ఆదు కుంటారని ఆయన తెలిపారు. జగన్ సుధీర్ఘపాదయాత్రలో అనేక కుట్రలు, కుతం త్రాలు, హత్యాయత్నాలు ఆరోపణలు ఎదుర్కొన్నారని ప్రజా సంక్షేమమే తన ఏకైక లక్ష్యంగాముందుకు నడిచారని పేర్కొన్నారు. అధికార పార్టీ నేతలు ఆయనపై బౌతిక దాడులకు తెగబడి జగన్ మోహన్‌రెడ్డిని అంతమొందించే దారుణానికి కూడా పూనుకున్నారని చివరకు హత్యాయత్నంపై జాతీయ భద్రతా విచారణ సంస్థ నిర్వహిస్తున్న విచారణనుకూడా అడ్డుకోవడానికి తెలుగుదేశం ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమైనచర్య అని శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రప్రభుత్వ నేతలు, దేశం పార్టీనాయకులు ఎన్నికుతంత్రాలు చేసిన 2019 ఎన్నికలలో 'తెలుగుదేశం'నకు పరాభవం తప్పదని ఆయనను హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పార్టీ నాయకులు పిళ్ళా విజయకుమార్, చనుమల్ల వెంకటరమణ, కె.వి.సూర్య నారాయణరాజు, అంబళ్ల శ్రీరాములునాయుడు, బలిజ పేట మండల పార్టీ అధ్యక్షులు బండారు సత్య నారాయణమూర్తి పాల్గొన్నారు.

## ప్యాకేజీ కోసం కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు



అచ్యుతాపురం : ఏపిఐఐసి ప్యాకేజీ కోసం పూడిమడక నిర్వాసిత మత్స్యకారులు జనసేన, సిపిఎం పార్టీ అధ్వర్యంలో తహసీల్దార్ కార్యలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహం´దీక్షలు శుక్రవారానికి 2 వ రోజుకు చేరుకుంది.

ఈ దీక్షలో పాల్గొన్న జనసేన పార్టీ అనకాపల్లి పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టి చిరంజీవి మాట్లాడుతూ ఏపిఐఐసి ప్యాకేజీ నిర్వాసిత మత్స్య కారులుకు అండగా ఉంటామన్నారు. ఈ దీక్షలో సిపిఎం నాయకులు కూండ్రపు సోమునాయిడు, చేపల తాతయ్య,టి రాములమ్మ, జనసేన నాయకులు మాడెం సూరి అప్పారావు, మేరుగు ప్రవీణ్ కుమార్, మేరుగు రవి ప్రసాద్, మైలపల్లి కాశీరాం అధిక సంఖ్యలో నిర్వాసిత మత్స్యకారులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ నులిపురుగుల దినోత్సవం



ములగాడ: జీవీఎంసీ 46 వార్డు పరిధిలో గల జీవీఎంసీ ఉన్నత పాఠశాల లో శుక్రవారం విద్యార్థులకు జాతీయ నులి పురుగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు చిన్నారులకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేసి చిన్నపిల్లల పౌష్టికాహారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు జీవీఎంసీ సిబ్బంది ఉపాధ్యా యులు పాల్గొన్నారు

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## నేడు కశింకోట గౌరమ్మ సంబరం



అనకాపల్లి : మండల కేంద్రమైన కశింకోటలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహకులు వేగి గోపికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతీఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. ఉదయం నుండి భక్తులకు దర్శన భాగ్యం కలుగుతుందన్నారు. అలాగే పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసామన్నారు. భక్తులు, గ్రామప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### ముత్యాలమ్మపాలెంలో
## చంద్రన్న బీమా అందజేత



పరవాడ: పరవాడ మండలము ముత్యాలమ్మపాలెం గ్రామంలో బొందిమసేను 57సంవత్సరాలు అనారోగ్యము కారణంగా మృతి చెందారు. దహన ఖర్చులు నిమిత్తము తక్షణమే కుమారుడు బొంది మురళికి 5000 రూపాయాలు వైస్ ఎంపిపిచింతకాయల సుజాత ముత్యాలు చేతులు మీదుగా అందజేశారు. మిగతా ఇరవైఐదు వేలు రూపాయాలును నామిని ఎకౌంటులో జమ చేస్తామని బీమా మిత్ర యేసు రత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### పరవాడలో
## పసుపు కుంకుమ - 2 చెక్కులు పంపిణీ
### ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు



పరవాడ: మండల కేంద్రమైన పరవాడ ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారము డ్వాక్రా మహిళలకు పసుపు కుంకుమ క్రింద చెక్కులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి హాజరై ఆయన చేతులు మీదుగా పంపిణీ చేశారు. మొత్తము 14కొత్త డ్వాక్రా సంఘాలకు 13,30,000 రూపాయలు చెక్కును లబ్ధిదార్లుకు అంద జేశారు. అనంతరము ఆయన మాట్లా డుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మరియు కొత్తగా రూపకల్పన చేసిన హామీలను నేరవేర్చడములో ఎల్లప్పుడు తెలుగుదేశం పార్టీ ముందంజలో ఉంటుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, ఇఒఅర్‌డి హేమసుందర్, ఏపిఎమ్ రంగారావు,టిడిపి మండల వాణిజ్య విభాగం అధ్యక్షులు కొమటిబుజ్జి(లెజండ్), మండల పార్టీ ప్రెసిడెంట్ బొండా సన్నిదేముడు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమంలో అగ్రభాగం

విజయనగరం : అక్షరక్రమంలోనే కాకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రభాగంలో నిలుపుతున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ అన్నారు. జన్మభూమి-మాఊరు సభలను మంగళవారం 13, 6, 22, 30, 38 వార్డుల్లో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణలు మాట్లాడుతూ నవ్యాంధ్ర లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ, ఇచ్చిన హామీల మేరకు ప్రజా సంక్షేమ పథకాల అమలుకు ఎటువంటి ఆటంకం కలిగించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుపరిపాలన సాగిస్తున్నా రన్నారు. ఇప్పటికే రైతురుణమాఫీ పథకంలో 25వేల కోట్లు ప్రకటించిన ప్రభుత్వం రైతుల ఖాతాలకు 15వేల కోట్లకు పైగా నగదు జమ చేసిందన్నారు. మిగిలిన నగదు త్వరలో జమ చేయనున్నట్లు వివరించారు.

డ్వాక్రా మహిళలకు పసుపు కుంకుమ పథకంలో 10వేలు, పెళ్లిళ్లకు, పండగ లకు కానుకలు అందించడం వంటి 150 సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.

రానున్న రోజుల్లో రాష్ట్రంలోతెలుగుదేశం ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేలా ప్రజలందరూ సహకరిం చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ టి.వేణుగోపాల్, అసిస్టెంట్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఎంఇ మత్స్యరాజు, ఎంహెచ్ఓ డా.దీపక్, సిటిప్లానింగ్ ఆఫీసర్లు శోభన్‌బాబు, హరిదాసు, కౌన్సిలర్లు మైలపల్లి పైడిరాజు, గార సత్యనారాయణ, కరణం విజయలక్ష్మి, గేదెల ఆదిబాబు, జన్మభూమి కమిటీ సభ్యులు డా.వి.ఎస్.ప్రసాద్, పెంటకోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన యాత్ర సినిమా శుక్రవారం అనకాపల్లి పట్టణంలో షిరిగీసాయి థియేటర్‌లో రిలీజ్ అయిన సందర్భంగా వైసిపి శ్రేణులు థియేటర్ వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, ఆళ్ల నాగేశ్వరరావు, కొణతాల మురళీకృష్ణ, గొర్లి సూరిబాబు,పలకా రవి, జాజుల రమేష్, గైపూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు వరి, జీడిమామిడి,
## అపరాల పంటలపై శిక్షణ



రైతులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

నాతవరం : నాతవరం మండలం సరుగుడు గ్రామ పంచాయతీలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) వారి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా సరుగుడు పరిసర గ్రామాల్లో పండిస్తున్న పంటలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా వరి, జీడిమామిడి, అపరాలపై శిక్షణ ఇచ్చారు. వరిలో యాజమాన్య పద్దతులు, అందుబాటులో ఉండే రకాలు, కలుపు మందులు, సమగ్ర నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, పంట పండించుటకు పెట్టే పెట్టుబడిని తగ్గించడం, అధిక దిగుబడులు సాదించడం వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. జీడిమామిడిలో అధిక దిగుబడులను సాధించుటకు గాను, పంటల పునరుత్పత్తికి, ఎరువుల యాజమాన్యంపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సిహెచ్.చిరంజీవి, ఆత్మ ఏటిఎం పి.సత్యవేణి, ఎఫ్‌పిఒ రైతులు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, ఎఇఎస్ భవానీ, అపర్ణ పాల్గొన్నారు.

### ఆధ్యాంతం ఆసక్తికరం..
## మీకూ ఓ కథ చెప్పాలి చిత్రం

విజయనగరం: సామాజిక ఇతివృత్తంతో ..ఒక కథని సెల్యులైడ్ చేయటం సాహసంతో కూడిన విషయం. అందులోనూ ఎన్నో ప్రేమకథలు ఇప్పటికే వచ్చాయి. ప్రేమబరిలో 'చిక్కు'కుని...నేర ప్రవృత్తిగా ఆరోపించబడి చివరకి బయటపడే సంఘటనలతో...మంచి ఇతివృత్తాన్ని అందిస్తూ నలుగురు యువకులు కలిసి తీసిన చిత్రమే " మీకు ఓ కథ చెప్పాలి' ! విజయనగరం , విశాఖ పరిసర ప్రాంతాల్లో అందమైన లొకేషన్లలో గంటన్నర సేపు సాగే ఈ చిత్రం ఆద్యాంతం ఉత్కంఠతని రేపుతుంది. మంగళవారం ఈ చిత్రానికి సంబంధిచిన మోషన్ పోస్టర్ స్థానిక వి.కె.ఆర్ రికార్డింగ్ స్టూడియోలో ప్రముఖ సినీ గాయకురాలు సురభి శ్రీవాణి చేతుల మీదుగా విడుదల చేశారు. తదుపరి టైటిల్ టీజర్‌ను విడుదల అయింది. ఈ చిత్రానికి వంశీకాంత్ రేఖాన అందించిన పాటలు, సంగీతం ప్రేక్షకులను చిత్రంలోని తీసుకుపోతాయి. అడుగడునా సస్పెన్స్..థ్రిల్లింగ్‌తో దర్శకులు ఎం.నవీన్ కుమార్, అఖిల్ ఖండవిల్లి తీసిన చిత్రీకరణ ఆసక్తిని కల్గిస్తుంది. ఫొటోగ్రఫీ అశోక్ డబ్బీరు వినూత్న ప్రయోగాలతో మన కళ్ళముందు సంఘటన జరిగిన విధంగా తెరకెక్కించారు. ఈ చిత్రానికి కథ కుమారి సామవేదుల గీతారాణి, డైరక్షన్ డిపార్డుమెంట్ వంశీ.జి, జ్ఞానదీప్ దినవహి, వంశీకిశోర్, స్టంట్స్ హరీష్..ప్రొడక్షన్ కో-ఆర్డినేటర్స్ క్షకాంత శర్మ, హర్షవర్ధన్.

## ముఖ్యమంత్రికి అండగా ఉండాలి

విజయనగరం : కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను అమలుపర్చకపోయినా, రాష్ట్ర అభివృద్ధికి సహకరించకపోయినా రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం తపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలంతా అండగా నిలబడాలని ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ అన్నారు. మంగళవారం 6, 30 వార్డుల్లో తెలుగుదేశం పార్టీ వార్డుదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీసాల గీత, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయమని అన్నారు.

కావలెను
MATHS FACULTY
VI th X th Class
Evining 6 to 8 PM
TPT Colony,
Seethammadhara
Visakhapatnam - 13
9182876798

సీ బుక్ పడిపోయినది
యానాం కురసంపేటకు చెందిన వైదాడి కాసులరావు S/o. వై.కృష్ణమూర్తికు చెందిన సీ బుక్కు నెంబర్ సివై04 ఎ 2941 పడిపోయింది. ఈ నెల 1వ తేదీన కురసంపేట ఇంటివద్ద నుండి మోటారు వాహనంపై యానాం వెళ్తుండగా చిన్నా సెంటర్‌లో పడిపోయింది. ఇది ఎవరికైనా దొరికనయెడలా ఈ క్రింది చిరునామాకు తెలియగోరుచున్నాం.
వైదాడి కాసులరావు,
S/o. వై. కృష్ణమూర్తి,
డోర్ నెంబర్ 6-2-154,
కురుసంపేట, యానాం,
సెల్ నెంబర్
8978015805.

## పాలిటెక్నిక్ కాలేజి లెక్చరర్ చిట్లరాజుకి డాక్టరేట్



నర్సీపట్నం : పాలిటెక్నిక్ కళాశాల నర్సీపట్నం మెకానికల్ డిపార్టుమెంట్ సీనియర్ లెక్చరర్ అయిన చిట్లరాజుకి ఆంధ్రా యూనివర్శిటీ డాక్టరేట్‌కి ఎంపిక చేసింది. ఆంధ్రా యూనివర్శిటీలో మెకానికల్ డిపార్టుమెంట్‌లో హర్డ్‌టక్నింగ్ ఇన్‌స్టీల్‌పై పిహెచ్‌డి చేశారు. దీనికి సంబంధించి డాక్టరేట్‌ను ఎయు ప్రకటించింది. గురువారం విడుదల చేసిన జాబితాలో రాజుకి డాక్టరేట్ ప్రధానంకి ఎంపికయినట్లు పేర్కొన్నారు. సదరు ఇంజనీరింగ్ విభాగంలో నర్సీపట్నంలో రాజుకి డాక్టరేట్ మొదటిగా రావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. కుటుంబీకులు సంతోషాన్ని పంచుకున్నారు.

### ఆరుతున్న కుంపటి...ఆదుకున్న ఏ.టి.కె.

విజయనగరం :ముగ్గు బుట్టవంటి తల, ముడతలు పడిన దేహం ..కాంతిలేని గాజుకళ్ళు...తన కన్నా శవం నయం..అన్న చందంగా ఆ ముసలిప్రాణి గత నాలుగురోజులుగా రోడ్డు మీద పడి ఉన్నాడు. ఇంక కాస్తలో ఆకలిని జయంచలేక, కాస్తలో కన్ను మూసేలా ఉన్నాడు. వెంటనే విషయం తెలిసిన స్థానిక ఏ.టి.కె.స్వచ్ఛంధ సంస్థ స్పందించింది. వెంటనే పరుగులు పెట్టింది. ఆ పండుటాకు పాతబస్టాండ్ సమీపాన ఉన్నాడని తెలిసి ముందు 108 కు చరవాణి ద్వారా సమాచారం అందించింది. వారు రాగానే సంస్థ వైద్యులు డాక్టర్ శ్రీధర్ ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు చేయించి కాస్త కుదుటపడ్డాక సంస్థ నిర్వహిస్తున్న "వెలుగు' అనాధ ఆశ్రమానికి తరలించమని సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్ పిలుపుమేరకు అక్కడికి తరలించారు.ఇంకా తాను కోలుకోలేదు. తన ఊరు, పేరు చెప్పలేకపోతున్నాడు.ఈ సేవా కార్యక్రమంలో ఎస్.కె.నాగూర్, సంస్థ కార్యదర్శిఎం.విజయభాస్కర్, చేయూత సంస్థ అధ్యక్షులు ముడిదాపు రాము. పవన్ కుమార్, నాయుడుతదితరులు పాల్గొన్నారు. ఇకపై తన సంస్థ అతని బాధ్యత చూస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## దివ్యాంగులను ఆదుకుంటాం
### సహిత విద్య జిల్లా సమన్వయకర్త శ్రీదేవి



గుర్తింపు కేంద్రానికి తన కుమార్తెను మోసుకొని వస్తున్న తండ్రి



దివ్యాంగులకు పరిశీలిస్తున్న దృశ్యం

నర్సీపట్నం : దివ్యాంగులకు కేజిహెచ్ వైద్యులచే పరీక్షలు చేయించి వారికి అవసరమైన పరికరములు అందజేస్తామని సహిత విద్య జిల్లా సమన్వయకర్త శ్రీదేవి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ప్రాధమికోన్నత పాఠశాలలో 11 మండలాల దివ్యాంగుల అవసరాల గుర్తింపు ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇటువంటి కార్యక్రమాలు అనుభవజ్ఞులైన డాక్టర్ల పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో చేపడుతున్నామన్నారు. త్వరలో అవసరమైన వారికి పరికరాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ సమన్వయకర్త రామకృష్ణ, హెచ్‌ఎం అచ్యుతం, 11 మండలాల సహిత విద్య ఉపాధ్యాయులు, 500 మంది కంటే ఎక్కువ దివ్యాంగులు పాల్గన్నారు. వీరికి భోజనాలు పెట్టి రవాణా భత్యం విధిగా చెల్లించామన్నారు.

## పంచగ్రామాల భూసమస్య పరిష్కారం కాబోతున్నందుకు అప్పన్నకి బండారు పూజలు



సింహాచలం : సింహాచలం మరియు చుట్టుప్రక్కల పంచ గ్రామల ప్రజలు ఏన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తన్న పంచగ్రామల సమస్యకు అసెంబ్లీ లో ప్రత్యేకంగా చట్టం చేసి అసెంబ్లీ అమోదం తెలిపి భూసమస్యపరిష్కారంకి అడుగులుపడుతున్న నేపథ్యంలో పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్య నారాయణమూర్తి, వార్డు నాయకులు కార్యకర్తలతో కలసి శుక్రవారం సింహాచలం తొలి పావంచ వద్ద అప్పన్నకి కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ గత ఎలెక్షన్ లో చంద్రబాబునాయుడు ఈ సమస్య పరిష్కరిస్తామని చెప్పినట్టుగా గెలిచిన వెంటనే మొదటి మీటింగ్ వైజాగ్లో నిర్వహించి సమస్య పరిష్కారానికి తొలి అడుగు వేశామని సమస్య కోర్టులోవున్న అసెంబ్లీలో ప్రత్యేక చెట్టము చేసి అసెంబ్లీలో ఆమోదం తెలియచేశామని అసెంబ్లీ లో ఆమోదం చేసి వెంటనే గవర్నర్ గారికి పంపించామని త్వరలో జీవో విడుదలవుతుందని మీ బాధలన్నీ తొలిగి పోతాయని మీరు నిశ్చింతగా ఇంటిమీద ఇల్లు కట్టుకో వచ్చునని ఖాళీ స్థలంలో గృహ నిర్మాణాలు చేసుకోవచ్చని సమస్య పరిష్కరించినందుకు అసెంబ్లీ లోనే చంద్రబాబుగారికి కృతజ్ఞత చెబుతూ పాదాభివందనం చేసానని ఈ సమస్య ఎప్పుడో పరిష్కారం అయ్యేదని జగన్ కోర్టులో కేసు వేయించి సమస్య పరిష్కారం కాకుండా అడ్డుపడ్డాడని ఇటువంటి ప్రతిపక్ష నాయకుడు ఎక్కడ లేడని ఆయనన్నారు.

ఈ కార్యక్రమంలో 72 వ వార్డు అద్యక్షుడు పిసినివరహా నరసింహం పంచదార్ల శ్రీనివాసు లండ శ్రీను సతివాడ శంకరరావు గు సిడి బాబు రౌతు రాంబాబు గండ్రెడ్డి వెంకటరమణ ఇతర టిడిపి నాయ కులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### రామస్వామితోట, వేట్లపాలెంలో

## రావాలి జగన్ కావాలి జగన్ కార్యక్రమం



కాట్రేనికోన : కాట్రేనికోన మండలంలో రామస్వామి తోట, వేట్లపాలెం గ్రామంలో శుక్రవారం రావాలి జగన్ కావాలి జగన్ కార్యక్రమం జరిగింది. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో గతంలో ఎంతో అభివృద్ధి చేశామని మళ్లీ అధికారంలోకి రాగానే ప్రజల కోసం పనిచేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకులు నల్లా నరసింహ మూర్తి, నడింపల్లి సూరిబాబు, సుధాకర్, గిడ్ల శ్రీనివాస్, శాంతి సుధ తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న గృహాలకు కేంద్రం సహకారం

యానాం: నియోజకవర్గంలోని శిథిలావస్థ స్థితిలో ఉన్న గృహాల పునఃనిర్మాణానికి కేంద్రం అమృత పథకంలో ఆర్థిక సహాయం అందించేందుకు అంగీకరించినట్లు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు తెలిపారు. ఒకసారి గృహ నిర్మాణ సహాయం అందచేసి తిరిగి రెండోవసారి సహాయం అందించడానికి వీలులేని విధంగా ఏర్పాటుచేసిన నిబంధనలను పుదుచ్చేరి విషయంలో కేంద్రం సడలించడం చాలా గొప్ప విషయం అని అన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలుచేసిన ఇందిరా ఆవాజ్‌యోజన వాంబే గృహం, కామరాజు గృహ నిర్మాణ పథకం, మత్స్యశాఖ గృహ నిర్మాణ పథకాల ద్వారా లబ్ధిదారులు నిర్మించుకున్న పాత ఇల్లు పూర్తిగా శిథిలాస్థితికి చేరిన, కూలిపోయిన, కూలగొట్టిన తిరిగి ఉచిత గృహ నిర్మాణ సహాయం అందించడానికి కేంద్ర పట్టణాభివృద్ధి గృహ నిర్మాణశాఖ మంత్రి, కార్యదర్శులతో మంత్రి మల్లాడి బేటీ అయ్యారు. ఈ పథకంలో ఇప్పటికే దరఖాస్తులు తీసుకున్న లబ్ధిదారులు పూర్తిస్థాయిలో 11వ తేదీ నాటికి మంత్రి క్యాంపు కార్యాలయంలో అందచేయాలని సూచించారు. పూర్తిస్థాయిలో ఉన్న దరఖాస్తులపై ఈ నెల 18వ తేదీన పుదుచ్చేరి బోర్డు సమావేశంలో చర్చించి కేంద్రానికి పంపనున్నామన్నారు. ఢిల్లీలో ఈ నెల 25వ తేదీన జరగనున్న సమావేశంలో కేంద్రం నిధులు విడుదలచేయనున్నాదన్నారు.

## జాతీయ ఫైలేరియా నివారణ దినోత్సవం



పెద్దాపురం: శుక్రవారం జాతీయ ఫైలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పాత హాస్పిటల్ ఫైలేరియా సెంటర్ యూనిట్ నందు మునిసిపల్ వైస్ చైర్మన్ కురుపూరిరాజు, సీనియర్ మునిసిపల్ కౌన్సిల్ సభ్యులు విజ్జపు రాజశేఖర్‌ల చేతులమీదుగా డిఇసి మాత్రల పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ ఎన్ సుదీప్తి, మునిసిపల్ కమీషనర్ శేషాద్రి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జీవన్‌కుమార్, ఫైలేరియా హెల్త్ ఇన్‌స్పెక్టర్ పి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

## యాత్ర సినిమా రిలీజ్ సందర్భంగా బైక్ ర్యాలీ



భీమునిపట్నం: దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి జీవిత కథ ఆధారంగా తీసిన యాత్ర సినిమా రిలిజ్ సందర్భంగా భీమిలి పట్టణ యూత్ అధ్యక్షుడు బింగి హరి కిరణ్ రెడ్డి ఆధ్వర్యలో యాత్ర టిషర్టు యూత్ వేసుకొని తాత దియేటర్ నుండి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీనీ భీమిలి పట్టణ ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరెడ్డి వైఎస్ జెండా ఊపి ప్రారంభించారు. ఆ తరువాత బైపాస్‌లో నున్న వై.ఎస్.ఆర్...రాజశేఖరరెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలుతో ఘనం గా నివాళులు అర్పించారు.. అనంతరం సినిమా ఇంటర్వెల్‌లో యూత్ అధ్యక్షుడు బింగి. హరి కిరణ్ రెడ్డి కేక్ కటింగ్ నిర్వహించారు...కేక్‌ను ముఖ్య అతిథిలుగా జీరు వెంకటరెడ్డి,, దియేటర్ యాజమాన్యం గోపిలకుతో కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రచార కమిటీ అధ్యక్షుడు పిన్నింటి ఎర్రయ్య రెడ్డి,, పందిరి విజయ్ కుమార్, యూత్ ఆర్. ప్రభాకర్ నాయుడు, గుండాసి, మధు నాయుడుజీరు భారతి రెడ్డి, అప్పలసూరి రెడ్డి,,ఎస్. వీరుబాబు రెడ్డి,, జీరు ప్రసాద్ రెడ్డి,, జీరు వేణు గోపాల్ రెడ్డి, ఎస్. శివారెడ్డి, ,కొంకి వెంకటేష్,, తదితర నాయకులు పాల్గొన్నారు.



ప్రకృతి మరియు సూక్ష్మ వ్యవసాయ పద్ధతుల మీద రైతులకు అవగాహన సదస్సును అక్కయపాలెం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ శ్యామలా, కన్సల్టెంట్ వై నానాజీ, ఇ.ఒ. జగదీష్ మరియు రైతులు పాల్గొన్నారు.

## పోస్టుల భర్తీకీ దరఖాస్తులు

యానాం: సాంఘీక సంక్షేమశాఖ పరిధిలోని జిల్లా మహిళా కేంద్రాలలో విధులు నిర్వహించేందుకు మహిళా సంక్షేమఅధికారిణికో ఆర్డినేటర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు తెలిపారు. పోస్టులకు మాస్టర్ డిగ్రీ చేసిన మహిళలు మహిళా సంక్షేమ అధికారిణి పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా హ్యూమానిటీస్ అండర్ సోషల్ సర్వీసెస్ లేదా సోషల్ వర్కులో డిగ్రీ చేసినవారు కోఆర్డినేటర్ పోస్టుకు ఈ నెల 13 లోగా దరఖాస్తుచేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సాంఘిక సంక్షేమశాఖ అధికారి చింతా రామజోగిని సంప్రదించాలన్నారు.

## 12న జిప్‌మేర్ బృందం యానాం రాక

యానాం: కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో ఈ నెల 12న జిప్‌మేర్ బృందం యానాం రానున్నది. ఇప్పటికే 9 మంది అధికారుల బృందం వచ్చి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. స్పెషల్ డైరెక్టర్ డైరెక్టర్ జనరల్ ఎ.కె. గార్గ, అడిషనల్ డైరెక్టర్ జనరల్ జైస్వాల్ తో పాటు పిడబ్ల్యూడీ చీఫ్ ఇంజనీరు ఎన్ఎన్ఎస్ రావు, సిఎన్ సురేష్, రెడ్డి, ప్రకాష్, సాల్మన్‌రాజు, సత్యప్రకాష్, ఆర్‌కె. మీనాలు యానాం రావడం జరిగింది. మరో మారు 12 యానాం రానున్నారు.

## బోధన ఆసక్తిదాయకంగా సాగాలి

### వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు



విశాఖపట్నం: తరగతిగదిలో బోధన ఆసక్తిదాయకంగా, విద్యార్థుల్లో నూతన ఆలోచనలు రేకెత్తించే విధంగా సాగాలని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం ఉదయం ఏయూ హెచ్‌ఆర్‌డిసి కేంద్రంలో నిర్వహిస్తున్న ఓరియంటేషన్ కోర్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల భావాలు, ఆలోచనలు గుర్తెరిగి తదనుగుణంగా తమ బోధనను అధ్యాపకులు మార్పు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమైన జ్ఞానాన్ని అందించడంతో పాటు వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడం అవసరమన్నారు. తరగతిలో అధ్యాపకుల మెలగే విధానం, ఉపయోగించే భాష, నడవడిక వంటివి విద్యార్థులను ప్రభావితం చేస్తాయన్నారు. ఇక్కడ అందించే శిక్షణ భవిష్యత్‌లో ఎంతో ఉపకరిస్తుందన్నారు. జ్ఞాన సమాజంలో నిరంతరం అభ్యసనం అవసరమని హెచ్‌ఆర్‌డిసి సంచాలకులు ఆచార్య పి.విశ్వనాథం అన్నారు. అధ్యాపకులు నూతన జ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ కాలానుగుణంగా విద్యార్థులకు అందించడం అవసరమన్నారు. కార్యక్రమంలో కేంద్రం సహాయ సంచాలకులు ఆచార్య ఎన్.ఏ.డి పాల్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యతోపాటు క్రీడల్లో ప్రతిభ చూపిస్తున్న

## విజ్ఞాన్ టాలెంట్ స్కూల్ విద్యార్థులు



ములగాడ: మల్కాపురం వెంకన్నపాలెం విజ్ఞాన్ టాలెంట్ స్కూల్ లో విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా ప్రతిభ చూపిస్తున్నారు ఇటీవల జరిగిన ఇండోర్ స్టేడియం నందు 3 ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో ఈస్కూల్ విద్యార్థులు పాల్గొని చక్కని ప్రతిభను చూపించి 6తరగతి చదువుతున్న సాయి హనుష్క కుకుకాట రెండు విభాగాల్లో 2 స్వర్ణాలు సాధించింది మరో విద్యార్థి కె వి ఎస్ దిలీప్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు పాఠశాల కరస్పాండెంట్ వెంకటరెడ్డి మాట్లాడుతూ మా పాఠశాల నుంచి ఇదివరలో ఇటువంటి నైపుణ్యం చూపెట్టిన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు వెళ్లారని అదే విధంగా ఈ విద్యార్థులు కూడా అదే బాటలో నడవాలని పాఠశాలకు మరింత ప్రతిష్ట తేవాలని విద్యతోపాటు క్రీడల్లో కూడా మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మూర్తి మరియు ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## పెద్దాపురం రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికలు

పెద్దాపురం: పెద్దాపురం డివిజన్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టి.ఎ. కృష్ణారావు ఎన్నికైనారు. శుక్రవారం పెద్దాపురం రెవెన్యూ డివిజనఎ కార్యవర్గ సభ్యులు ఎన్నికలు రెవెన్యూ డివిజనఎ అధికారా కార్యాలయం ప్రాంగణంలో జరిగింది. పెద్దాపురం డిప్యూటీ తహశీల్దార్ టి.ఎ. కృష్ణారావు అధ్యక్షులుగాను, ఎస్‌వి నాచారయ్య ఉపాధ్యక్షులుగాను 10 మంది సభ్యులతో డివిజన్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె. వీరబాబు ప్రకటించారు. ఈ ప్రక్రియకు పెద్దాపురం ఆర్డీవో వసంతరాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు త్రినాధరావు, ఉపాధ్యక్షులు ఎస్‌వి దివాకర్ ప్రసంగించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణారావు మాట్లాడుతూ పెద్దాపురం డివిజన్ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తరువాత అసోసియేషన్ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు.

## శాంతకుమారి వైపే కాంగ్రెస్ పార్టీ మొగ్గు



అరకు: అరకులోయ నియోజక వర్గం నుండి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మెరకు అసెంబ్లీ మరియు పార్లమెంట్ అబ్యర్థుల ధరఖాస్తులు స్వీకారణ కార్యక్రమంలో బాగంగా అరకులోయ నియోజకవర్గం అసెంబ్లీ సీటు తనకు కేటాయించాలని పాచిపెంట. శాంతకుమారి తన అనుచర వర్గాలతో గురువారంనాడు విశాఖపట్నం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా నగర అధ్యక్షులు ద్రోణంరాజు శ్రీనివాస్, బేహర భాస్కర్ రావు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు పేడడ.రమణికుమారికి తమ ధరఖాస్తు సమర్పించడం జరిగింది.

అనంతరం ఆమె ఈ కార్యక్రమంలో అరకులోయ ఇంచార్జీ గంప రయి. సూరయ్య, ఎస్.టి.సెల్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్. పుచ్చపుండి.రామకృష్ణ యూత్ ప్రెసిడెంట్ కోనేటి.చిన్నారావు మాజి సర్పంచ్ ఎమ్.మత్స్యరాజు శెట్టి.భగత్‌రం అరకులోయ మండల కాంగ్రెస్ కార్యదర్శి అనంతగిరి సెక్రెటరీ కిల్లో. రామకృష్ణ తెడబరికి.భీమరావు నియోజకవర్గం అన్ని మండలాల కాంగ్రెస్ కార్యకర్తలు అనుచరులు పాల్గొన్నారు.

## గౌరవ డాక్టరేట్‌లు సమాజానికి మరింత చేరువకావాలి

### ఆంధ్ర విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు జి శశిభూషణరావు



విశాఖపట్నం: సమాజంలో ఎన్నో సేవా కార్యక్రమాలతో పేరు ప్రతిష్టలు నలుదిశలా కలిగినవారే గౌరవ డాక్టరేట్ పొందగలుగుతారని ఎ.యు. పాలకమండలి సభ్యులు, ప్రొఫెసర్ జి. శశిభూషణరావు అన్నారు. బాలల సేవా కార్యక్రమాల్లో కొన్నేళ్లుగా సేవలందిస్తున్న చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొండు శీతారాంకు సెయింట్ పాల్స్ ధియోలాజికల్ కళాశాల "గౌరవ డాక్టరేట్"ను ప్రధానం చేసింది. దీనిని పురస్కరించుకొని శుక్రవారం చిన్నవాల్తేరు మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జి. క్రిష్ణవేణి, పాఠశాల పూర్వవిద్యార్థి ఆంధ్రాయూనివర్శిటి లైబ్రరీ మాజీ సూపరింటెండెంట్ ద్వారపూడి రామారావుల నేతృత్వాన పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు గొండు శీతారాంను శాలువతో పుష్పగుచ్ఛాలను అందించి ప్రొఫెసర్ శశిభూషణరావు చేతులమీదుగా సత్కరించారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ శశిభూషణరావు మాట్లాడుతూ డాక్టరేట్ అనేది సమాజంలో ఎంతో అకుంఠిత దీక్ష, ఎన్నో విజయాలు సాధించిన వారికే లభిస్తాయన్నారు. ఈయన చేసే బాలల సేవాకార్యక్రమాల్లో తనవంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడు అందిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయని జి. క్రిష్ణవేణి మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధిని దశదిశలా చాటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాములు, గోవిందరావు, రాజా రవి, కనకరాజు, లక్ష్మి, వనిత తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్‌లో ఇంటి పన్ను కోత

కొయ్యూరుః ప్రభుత్వం రెట్టింపు చేసిన పింఛన్‌లో ఇంటి పన్ను వసూలు చేస్తున్నారని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. పంచాయతీల్లో ఇంటిపన్ను బకాయిలు పేరుకుపోవడంతో నెలకు ఖచ్చితంగా రూ.4లక్షల మేర నిర్దేశిత లక్ష్యంగా విధించి ఇంటి పన్ను వసూలు చేయాలని కార్యదర్శులపై ఒత్తిడి పెరిగింది. మండలంలో కార్యదర్శులే పింఛన్ పంపిణీ బాధ్యతలు నిర్వహిస్తుండటంతో వారు పింఛన్ పంపిణీలో ఇంటి పన్ను బకాయిలు మినహాయిస్తున్నారని పలువురు పింఛన్ లబ్ధిదారులు వాపోతున్నారు. పండుగ వాతావరణంలో రెట్టింపు చేసిన పింఛన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే పెంచిన పింఛన్ కళ్లారా చూసుకునే భాగ్యం లేకుండా కోతకు పాల్పడటం తగదని లబ్ధిదారులు అంటున్నారు. ఈ నెల పింఛన్ పూర్తిగా చెల్లించి రానున్న నెలలో ఇంటి పన్ను బకాయిలు వసూలు చేసుకునేలా చూడాలని వారంతా ఎంపిపి జి.సత్యనారాయణ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఎంపిపి స్పందించి అందుబాటులో ఉన్న రాజేంద్రపాలెం, కొయ్యూరు పంచాయతీల కార్యదర్శులకు ఈ నెలలో ఏ విధంగా కోత లేకుండా పింఛన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. అలాగే మిగిలిన పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించినట్టు ఎంపిపి సత్యనారాయణ తెలిపారు.

## ప్రధానమంత్రి నగర పర్యటనపై బిజెపి ఓబీసీ మోర్చా సమావేశం



విశాఖపట్నం : ప్రధానమంత్రి మోడీ ఈనెల 27 తేదీన విశాఖ నగర పర్యటన విజయవంతం చెయ్యడానికి ఎటువంటి కార్యక్రమాలు చేపట్టాలన్న విషయాన్ని చర్చించడానికి విశాఖ భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సమావేశం బారతీయ జనతా నగర కార్యాలయంలో జరిగింది. ఓబీసీ మోర్చా నగర అద్యక్షులు కోరాడ అప్పారావు అద్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు టీ.సుబ్బరామిరెడ్డి, రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కే.వి.రమణ పాల్గొన్నారు. వెనుకబడిన తరగతులకు చెందిన నరేంద్ర మోడీ ప్రధానమంత్రి చేసిన ఘనత బీజేపీకి చెందుతుందనీ మోడీ ప్రధానిగా ఉండబట్టే జాతీయ బీసీ కమిషన్‌కి చట్టబద్ధత కల్పించారని, జాతీయ స్థాయిలో ఓబీసీల్లో వర్గీకరణకు ప్రయత్నం ప్రారంభించడం జరిగిందనీ, బీసీ ప్రధాని సమావేశాన్ని విజయవంతం చెయ్యవలసిన బాధ్యత బీసీల్లోకి తీసుకువెళ్ళాలని తీర్మానించడం జరిగింది.



జనసేన జనబాట కార్యక్రమంలో భాగంగాశుక్రవారం 35వ వార్డు డిఎల్‌బి గ్రౌండ్స్ తో పసుపులేటి ఉషాకిరణ్ ప్రచారం నిర్వహించారు. గ్రౌండ్‌కి వచ్చిన వాకర్లు అందరికి ఎన్నికల గుర్తు గాజుగ్లాసుని పరిచయం చేస్తూ గాజుగ్లాసులో టీ పంపిణి చేస్తూ మ్యానిఫెస్టో వివరించారు. ఉషాకిరణ్ మాట్లాడుతూ ప్రజలు పరిపాలనలో పారదర్శకత ఉండాలంటే అవినీతి మరకలు లేని నాయకత్వం ఈరోజు ఈరాష్ట్రానికికావాలిని పవన్ కల్యాణ్‌ని ముఖ్యమంత్రిగా చేయటానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వానపల్లి రంగారావు, ప్రకాశరావు, మురళి, విఠల్, గోపికళ్యాణ్ పలువురు వీరమహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

# చెక్కుల పంపిణీలో అవకతవకలపై మహిళల నిరసన



నిరసన తెలియజేస్తున్న డ్వాక్రా మహిళలు

గాజువాక : రాష్ట్ర ప్రభుత్వ డ్వాక్రా మహిళలకు అందిస్తున్న పసుపు-కుంకుమ చెక్కుల పంపిణీలో అవకతవకలు జరుగు తున్నాయని జీవిఎమ్‌సి 50వ వార్డు వాంబే కాలనీలో శుక్రవారం మహిళలు ఆందోళనకు దిగారు.

గత మూడు మాసాల నుంచి అంద వలసిన పింఛను సొమ్మును అందించకుండా జీవిఎంసి యుసిడి సిబ్బంది పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పండు ముసలి వాళ్లని కూడా చూడకుండా కసురుకుంటూ పొమ్మంటున్నారని అన్నారు. డ్వాక్రా పొదుపు సొమ్ము మంజూరు సమయంలో చేతివాటం చూపిస్తున్నారని, వారికి ఎంతో కొంత ముట్ట చెప్పకపోతే చెక్కులు అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించటం లేదని తెలిపారు. జీవిఎంసి కమీషనర్ దృష్టికి సమస్యలను తీసుకుని వెళ్లినా స్పందించడం లేదని వాపోయారు.

ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక డ్వాక్రా మహిళలు పాల్గొని పెద్ద ఎత్తున ఆర్‌పిలపై నినాదాలు చేశారు.

# ప్రజా సమస్యలపై ప్రతిపక్ష పాత్ర.. ఈ పాదయాత్ర

## వైయస్సార్ నేత మజ్జిశ్రీను

విజయనగరం: చరిత్రలో లేని విధంగా ప్రజాసంక్షేమం కోసం 14నెలలు పాటు 3650 కి॥మీ ॥ సుధీర్ఘ పాదయాత్ర చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర ఒక చారిత్రక ఘట్టంగా జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయవ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అభివర్ణించారు.మంగళవారం స్థానిక సత్యాకార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.14నెలలు క్రితం ఇడుపులపాయలో ప్రారంభమైన ప్రజాసంకల్పయాత్ర ఈ నెల 9న ఇచ్ఛాపురంలో ముగియనుందని ఆయన తెలిపారు. ఇచ్ఛాపురంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని రాష్ట్రం నలుమూలలనుండి పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీలు, పార్టీనాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున ఇచ్ఛాపురంనకు తరలి రానున్నట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లానుండి కూడా పార్టీ శ్రేణులు, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభిమానులు బహిరంగ సభకు విచ్చేయాలని ఆయన కోరారు.సెప్టెంబరు జిల్లాలో జరిగిన 9బహిరంగ సభలలోను, పాదయాత్రలోను 34మండలాలు, 4 పురపాలక సంఘాల పరిధిలోగల అన్నివర్గాల ప్రజలు పాల్గొని జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యలు చెప్పుకున్నారని తెలిపారు.దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి 2004లో నిర్వహించిన మహాప్రస్థానంలో పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకొని ఆయన అధికారంలోకి వచ్చినతరువాత అటువంటి సమస్యలన్నీ పరిష్కరించిన విధంగానే 2019 ఎన్నికలలో వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసమస్యలు పరిష్కరిస్తారని శ్రీనివాసరావు ప్రజలకు బరోసా ఇచ్చారు.నాలుగన్నరేళ్లుగా తెలుగు దేశం ప్రభుత్వం ప్రజలకు పెన్సన్లు, గృహాలు, రేషన్‌కార్డులు వంటివి అర్హులకు అందజేయలేదన్నారు. నవరత్నాల కార్యక్రమం ద్వారా అన్నివర్గాల ప్రజలను ఆదుకుంటారని ఆయన తెలిపారు.

జగన్ సుధీర్ఘపాదయాత్రలో అనేక కుట్రలు, కుతంత్రాలు, హత్యాయత్నాలు ఆరోపణలు ఎదుర్కొన్నారని ప్రజా సంక్షేమమే తన ఏకైక లక్ష్యంగాముందుకు నడిచారని పేర్కొన్నారు. అధికార పార్టీ నేతలు ఆయనపై బౌతిక దాడులకు తెగబడి జగన్‌మోహన్‌రెడ్డిని అంతమొందించే దారుణానికి కూడా పూనుకున్నారని చివరకు హత్యాయత్నంపై జాతీయ భద్రతా విచారణ సంస్థ నిర్వహిస్తున్న విచారణనుకూడా అడ్డుకోవడానికి తెలుగుదేశం ప్రభు త్వం పూనుకోవడం దుర్మార్గమైనచర్య అని శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వ నేతలు, దేశం పార్టీనాయకులు ఎన్నికుతంత్రాలు చేసిన 2019 ఎన్నికలలో 'తెలుగుదేశం'నకు పరాభవం తప్పదని ఆయనను హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పార్టీ నాయకులు పిళ్ళా విజయకుమార్, చనుమల్ల వెంకటరమణ, కె.వి.సూర్యనారాయణరాజు, అంబళ్ల శ్రీరాములునాయుడు, బలిజ పేట మండల పార్టీ అధ్యక్షులు బండారు సత్య నారాయణమూర్తి పాల్గొన్నారు.

# నులిపురుగు నిర్మూలన మందులు పంపిణీ

## ముఖ్యఅతిథిగా డాక్టర్ ప్రమీల



పరవాడ : ప్రపంచనూలిపురుగుల నిర్మూలనదినంసందర్భంగా శుక్రవారము నూలిపురుగులనిర్మూలనమందులును పంఫిణీ చేసారు.ఈకార్యక్రమానికిముఖ్య అతిథిగాపరవాడవైద్యాదికారణి డాక్టర్ ప్రమీల హజరైఅమె చేతులుమీదగా విద్యార్ధులుకు అం ద జే సా ర ు . 1 - 1 8 వ య ు న స్సు గ ల వి ల్ల ల ు అం ద ర ూ ఈనిలిపురుగుమందులువేసికోవాలని అన్నారు. పరవాడ అసుపత్రి పరిధిలో సుమారుపదకుండువేలు మంది విద్యార్ధ లుకు ఈనీలిపురుగునిర్మూలన మందులును అందజేసామని అన్నారు. ఈకార్యక్రమంలో ఎ ఎన్ ఎమ్ రత్నం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# అనకాపల్లి పార్లమెంట్ కమిటీలో

## నర్సీపట్నం జనసైనికులు

నర్సీపట్నం : అనకాపల్లి పార్లమెంట్ కమిటీలో నర్సీపట్నం నియోజకవర్గం నుంచి పలువురిని ఎన్నుకున్నారు. అర్గనైజింగ్ కార్యదర్శిగా సరోజినిదేవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అద్దేపల్లి గణేష్, గండుబోగుల శ్రీనివాస్, వర్కింగ్ కమిటీ మెంబర్లుగా మారిశెట్టి రాజా, ద్వారపూడి జగదీష్, కొప్పక కళ్యాణ్, అల్లు నరేష్, బయపురెడ్డి అశోక్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధినేత పవన్ కళ్యాణ్ మా పై ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా వహిస్తామన్నారు.

# చిత్రభాను

# పెళ్లి పీటలెక్కనున్న వెంకటేశ్ కుమార్తె

సినీ నటుడు వెంకటేశ్ కుమార్తె ఆశ్రిత త్వరలో పెళ్లిపీటలెక్కనున్నారు. హైదరాబాద్ రేస్ క్లబ్ ఛైర్మన్ సురేందర్ రెడ్డి మనవడితో ఆశ్రిత వివాహం జరగబోతోంది. ఫిబ్రవరి 6న వెంకటేశ్ నివాసంలో సన్నిహితులు, స్నేహితుల సమక్షంలో ఘనంగా నిశ్చితార్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్రితది ప్రేమ వివాహమట. మార్చి 1న హైదరాబాద్‌లోనే వివాహం జరగనుంది. పెళ్లి పనులన్నీ వెంకటేశ్ దగ్గరుండి చూసుకుంటున్నారు. వివాహ వేడుక అనంతరం రామానాయుడు స్టూడియోస్‌లో గ్రాండ్‌గా వివాహ విందును ఏర్పాటుచేయనున్నారు.

తెలుగు సినీ ప్రముఖులే కాకుండా బాలీవుడ్‌కు చెందిన సెలబ్రిటీలు కూడా వేడుకకు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. ఆశ్రిత ప్రొఫెషనల్ బేకర్, ఫుడ్ బ్లాగర్. తన పర్సనల్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఆహార పదార్థాలకు సంబంధించిన ఫొటోలను తరచూ పోస్ట్ చేస్తుంటారు. పెళ్లి వేడుక పూర్తయ్యాక వెంకటేశ్ 'వెంకీ మామ' సినిమా షూటింగ్‌లో పాల్గొంటారని టాలీవుడ్ వర్గాల సమాచారం. ఇందులో వెంకటేశ్ మేనల్లుడు, సినీ నటుడు నాగచైతన్య కూడా ప్రధాన పాత్రలో నటించనున్నారు.

# పాతికేళ్ల బ్రహ్మచారి బాధ చూడవా..!

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం '118'. నివేదా థామస్, షాలినీ పాండే నాయికలు. కె.వి గుహన్ దర్శకత్వం వహిస్తున్నారు. మహేష్ కోనేరు నిర్మాత. మార్చి 1న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాలోని తొలి పాటను శుక్రవారం విడుదల చేశారు. దీన్ని కల్యాణ్ రామ్ ట్విటర్ వేదికగా షేర్ చేశారు. అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. 'చందమామే చేతికందే..



వెన్నెలేమో మబ్బులోనే, పూలచెట్టే కళ్ల ముందే, పువ్వులేమో కొమ్మ పైనే, చూస్తూనే ఎంతసేపు, తాకితేనే ఏంటి తప్పు, పాతికేళ్ల బ్రహ్మచారి బాధ చూడవా, పెళ్లిడేటు ఎప్పుడంటూ లెక్కలేసి చూసుకుంటూ రొమాన్సు చేయనీయవా..' అంటూ సాగే ఈ పాటకు యూట్యూబ్‌లో మంచి స్పందన లభిస్తోంది. పాట బాగుందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. రామాంజనేయులు ఈ పాటను రాశారు. శేఖర్ చంద్ర సంగీతం అందించారు. యజిన్ నిజర్ పాటను ఆలపించారు. ఈ సినిమాలో కల్యాణ్‌రామ్ కొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. ఇది థ్రిల్లర్ చిత్రమే అయినా ప్రేమ, భావోద్వేగాలకూ చోటు ఉంటుందని నిర్మాత తెలిపారు.






# యాత్ర రివ్యూ



ప్రతిపక్ష నాయకుడిగా దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి చేసిన పాదయాత్ర ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఓ కీలకఘట్టం. ఆయన ప్రజలకు మరింత చేరువ కావడానికి, అప్పట్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి వైఎస్సార్ చేసిన పాదయాత్ర ప్రధాన కారణం అని రాజకీయ విశ్లేషకులు చెబుతుంటారు. ఆ ఘట్టం ఆధారంగానే 'యాత్ర' తెరకెక్కింది. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిగా ప్రముఖ నటుడు మమ్ముట్టి నటించారు. ఈవెంట్ బేస్డ్ బయోపిక్‌గా రూపుదిద్దుకున్న ఈ సినిమా ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో మంచి అంచనాల్ని పెంచాయి. మరి ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఎలా ఉందో తెలుసుకుందాం...

కథేంటంటే: ప్రజా ప్రస్థానం పేరుతో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి(మమ్ముట్టి) చేసిన పాదయాత్ర, అందులోని భావోద్వేగాలతో ప్రధానంగా సాగే చిత్రమిది. పాదయాత్ర ఎలా మొదలుపెట్టారు? ఆ ప్రయాణంలో ప్రజల కష్టాల్ని ఎలా విన్నారు? వాళ్లకి తానున్నాననే భరోసా ఎలా ఇచ్చారు? వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్తు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలకి పాదయాత్ర ఎలా కారణమైంది? అనే విషయాల్ని ఈ సినిమాలో చూడొచ్చు. జాతీయ పార్టీలో ఉన్నప్పటికీ, హై కమాండ్‌ని కాదని ఆయన ఎలా నిర్ణయాలు తీసుకునేవారు? వ్యక్తిగతంగా ఆయన పార్టీపైన ఎలాంటి ముద్ర వేశారు? ప్రజల్లో ఎలా ఇమేజ్ తెచ్చుకున్నారనే విషయాల్ని ఇందులో చూపించారు. హైకమాండ్‌తో రాజకీయాలు, పాదయాత్ర మొదలుకొని... ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేయడంతో ఈ కథ ముగుస్తుంది.

ఎలా ఉందంటే: నమ్మి తన దగ్గరికి వచ్చినవాళ్లకి అభయం ఇవ్వడం మొదలుకొని... ఆయన ఒకసారి మాట ఇచ్చాక, ముందుకు వెళ్లాల్సిందే అనే తత్వాన్ని చూపిస్తూ, ఒక నాయకుడిగా ప్రజలతో ఎలా మమేకమయ్యారు? తనయుడు ప్రజానాయకుడు కావాలని తన తండ్రి రాజారెడ్డి కన్న కలని ఎలా నెరవేర్చారనే విషయాల్ని హైలైట్ చేస్తూ ఈ సినిమాని తీర్చిదిద్దారు దర్శకుడు. బయోపిక్ అంటే పుట్టు పూర్వోత్తరాలు మొదలుకొని ఉంటాయి. కానీ ఈ చిత్రం మాత్రం కేవలం వై.ఎస్ చేసిన పాదయాత్ర చుట్టూనే సాగుతుంది. ఆ యాత్రని ప్రారంభించడానికి ముందు సాగిన సంఘర్షణని కూడా బలంగా చూపించారు. అప్పుడు అధికారంలో ఉన్న బలమైన తెలుగుదేశం పార్టీని ఎలా ఎదుర్కోవాలి? గడువుకంటే ముందుగానే ఎన్నికలకు వెళ్లిన ఆ పార్టీని ఓడించి అధికారం ఎలా చేజిక్కించుకోవాలనే విషయంలో అప్పట్లో జరిగిన ఘటనలను ఆరంభ సన్నివేశాల్లో చూపిస్తూ అసలు కథని మొదలుపెట్టారు. 'మన గడప తొక్కి సాయం అడిగిన ఆడబిడ్డతో ఏందిరా రాజకీయం' అనే సంభాషణతో వైఎస్సార్ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించి... తనవాళ్లు అనుకున్నాక ఆయన వాళ్ల కోసం ఎంతదూరమైనా వెళతాననే విషయాన్ని ఆత్మీయుడైన కేవీపీ పాత్రతో చూపించారు. చేవెళ్ల నుంచి పాదయాత్ర మొదలుపెట్టే సన్నివేశాలతో భావోద్వేగాలు పండటం మొదలవుతుంది. కష్టాలు, కరవుతో రైతులు పొట్ట చేతపట్టుకుని వలస వెళ్లిపోతే, ఇంటి దగ్గర వృద్ధులు పడే అగచాట్లని సహజంగా చూపిస్తూ, అక్కడ కనిపించిన దయనీయ దృశ్యాలే ఆయన ప్రవేశపెట్టిన పథకాలకి కారణమయ్యాయన్నట్టుగా చూపించారు. ఆ సన్నివేశాలన్నింటిలోనూ భావోద్వేగాలు పండాయి.

ద్వితీయార్థంలో పార్టీని మించిన నాయకుడిగా రాజశేఖర్‌రెడ్డి ఎలా ఎదిగారనే విషయాల్ని చూపించారు. వై.ఎస్.విజయమ్మ, కేవీపీ, సబితా ఇంద్రారెడ్డి, వీహెచ్ తదితరుల పాత్రల్నే కాకుండా... కొన్ని కల్పిత పాత్రల్ని, కల్పిత సంఘటనల్ని కూడా సినిమాలో చూపించారు. పార్టీ హై కమాండ్‌కి ఏమాత్రం నచ్చని వ్యక్తిగా, హై కమాండ్‌ని ఎదిరించిన వ్యక్తిగా వై.ఎస్‌ని చూపించడం, కొందరు తెలుగుదేశం నాయకులు కూడా వై.ఎస్‌ని మెచ్చుకుంటూ ఆయనకి ఓటు వేస్తామని చెప్పడం, కాంగ్రెస్ పార్టీని ఒక విలన్‌గా చూపించడం వంటి సన్నివేశాలు కల్పితంలో భాగమే. చంద్రబాబు పాత్రని తెరపై నేరుగా చూపించలేదు. చిత్రబృందం ఇది రాజకీయ చిత్రం కాదని చెప్పుకొచ్చినా... సినిమా చూస్తున్నంతసేపు వర్తమాన రాజకీయాల్ని దృష్టిలో ఉంచుకునే తెరకెక్కించిన భావన కలుగుతుంది. చాలావరకు సన్నివేశాలు వై.ఎస్ గురించి తీసిన ఓ డాక్యుమెంటరీలా సాగుతుంటాయి. చివరి ఐదు నిమిషాల సన్నివేశాల్ని వై.ఎస్‌కి సంబంధించిన నిజమైన విజువల్స్‌ని, ఆయన అకాల మరణానికి సంబంధించిన సన్నివేశాల్ని, తండ్రి మరణించాక ప్రజల ముందుకొచ్చి మాట్లాడిన జగన్ ప్రసంగాన్ని ఒక పాట నేపథ్యంలో చూపించారు.

ఎవరెలా చేశారంటే: మమ్ముట్టి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి పాత్రలో ఒదిగిపోయారు. వై.ఎస్‌లా కనిపించకపోయినా, ఆయన హావభావాల్ని అనుకరించకపోయినా ఆ పాత్ర ఆత్మని అర్థం చేసుకుని నటించారు. ఆయన సొంతంగా తెలుగులో సంభాషణలు చెప్పిన విధానం కూడా ఆకట్టుకుంటుంది.

సినిమాలో సెంటిమెంట్, భావోద్వేగాలు పండటంలో మమ్ముట్టి పనితీరు ముఖ్య భూమిక పోషించింది. వై.ఎస్ ఆత్మీయుడైన కేవీపీ రామచంద్రరావు పాత్రలో రావు రమేష్, వై.ఎస్.విజయమ్మ పాత్రలో ఆశ్రిత వేముగంటి చక్కటి అభినయం ప్రదర్శించారు. వై.ఎస్.రాజారెడ్డి పాత్రలో జగపతిబాబు కనిపిస్తారు. సూర్యన్ కెమెరా పనితనం, 'కె' సంగీతం బాగుంది. 'పల్లెల్లో కళ ఉంది' పాట, చిత్రీకరణ విధానం ఆకట్టుకుంటాయి. దర్శకుడు మహి వి. రాఘవ్ పాదయాత్ర నేపథ్యంలోనే కథని అల్లిన విధానం, ఆయన మాటల రచన, డ్రామాని జోడించి భావోద్వేగాలు పండించిన విధానం మెప్పిస్తుంది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి.

# రాజన్న స్మృతులు ప్రజల్లో సుస్థిర స్థానం

## దక్షిణంలో అంబరాన్నంటిన 'యాత్ర' సంబరాలు



విశాఖ సిటీః దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చేపట్టిన పాదయాత్ర ఘట్టాన్ని వెండితెరపై దృశ్యకావ్యంగా 'యాత్ర' పేరుతో ఆవిష్కరించిన తీరు అమోఘమని విశాఖ వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం విడుదలైన యాత్ర సినిమా దక్షిణ నియోజకవర్గంలోని సంగం థియేటర్‌లో డాక్టర్ పీవీఆర్‌తో సహ నియోజకవర్గ ముఖ్య నాయకలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆయన సినిమాను వీక్షించారు. సినిమా చూస్తున్నంత సేపూ గుండె బరువెక్కిందని, భావోద్వేగానికి లోనయ్యానని ఆయన తెలియజేశారు. ప్రజల కష్టాలను, స్థితిగతులను రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ గడపకూ వెళ్లి స్వయంగా తెలుసుకోవాలని చేపట్టిన ఆనాటి మహాప్రస్థానం పాదయాత్రను ఈనాడు కళ్ళకు కట్టినట్టు, రాజన్నను గుర్తుకు తెచ్చుకుని నాటి జ్ఞాపకాలలోకి వెళ్లిపోయే విధంగా సినిమాను రూపొందించడం అభినందనీయమైన విషయమని అన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేయాలన్నా, ప్రజలకు ప్రాతినిధ్యం వహించాలన్నా ప్రజా క్షేత్రంలో జీవన గతులను ప్రత్యక్షంగా పూర్తిగా అవగాహన చేసుకున్నపుడే వాటి సాకారం సఫలీకృతమౌతుందని డా. పీవీ రమణ మూర్తి తెలియజేశారు.

చిత్రంలోని ఒక్కో సన్నివేశం హృదయానికి హత్తుకునేలా తీర్చిదిద్దడం జరిగిందని అన్నారు. ఈ చిత్రంలో రాజన్న వ్యక్తిత్వం, రాజకీయ ధోరణి, మాటకు.. నమ్మకానికి ఇచ్చే విలువ, ఆయనను నమ్ముకున్న వారికి ఇచ్చే భరోసా, స్నేహానికి ఇచ్చే విలువ, వీటిన్నింటిని మించి హామీ మేరకు నడుచుకోవడం రాజన్న ప్రత్యేకతగా మనోరంజకంగా తీర్చిదిద్దిన తీరు ప్రజలు మరిచిపోలేరన్నారు.

ఇచ్చిన మాట కోసం పదవులను సైతం త్యాగం చేస్తూ అధిష్ఠానాన్ని ధిక్కరించైనా మాట తప్పని.. మడమ తిప్పని నాయకత్వ లక్షణాలు పుణికిపుచ్చుకున్న నాయకుడు రాజన్న అని డాక్టర్ పేర్కొన్నారు. చిత్రాన్ని వీక్షించిన వారిలో రాష్ట్ర అధికార ప్రతినిధి జాన్‌వెస్లే, నగర యువజన విభాగం అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ మరియు పలు అనుబంధ సంఘాల ప్రతినిధులు, వార్డు అధ్యక్షులు, అభిమానులు, కార్యకర్తలు ఉన్నారు.



రాజన్న చిత్రాన్ని చూసేందుకు నేను సైతం అంటున్న చిన్నారి



*ఉత్తర నియోజకవర్గం కిన్నెర థియేటర్ వద్ద సమన్వయకర్త కెకె రాజు ఆధ్వర్యంలో సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రొంగలి జగన్నాథం, కొయ్య ప్రసాద రెడ్డి, పలు అభిమాన సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.*



### కన్నీటి పర్యంతమైన మహిళా అధ్యక్షురాలు గరికిన గౌరి

యాత్ర సినిమా చూస్తున్నంతసేపూ మహానేత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ విశాఖ నగర వైఎస్ఆర్ సీపీ నగర మహిళాధ్యక్షురాలు, గరికిన గౌరి కన్నీటిపర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజన్న రాజకీయంలో ఎదురులేని మహా నాయకుడని కొనియాడారు. ఆ మహానేత ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తాను గ్రేటర్ విశాఖ 29వ వార్డు కార్పొరేటర్‌గా పని చేసే అదృష్టం తనకు దక్కిందని ఆమె గుర్తుచేసుకున్నారు. తాను రాజకీయాలలోకి రావటానికి ముఖ్య ప్రేరణ రాజశేఖర్ రెడ్డిగారేనని అన్నారు.

రాజన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ద్వారా ప్రజలలో మంచిపేరు ప్రఖ్యాతులు సంపాదించారని పేర్కొన్నారు. ఈ చిత్రవీక్షణలో కళా హాస్పిటల్ అధినేత్రి డా. కళావతి మరియు మహిళలు పాల్గొన్నారు.

## బీచ్ కారిడార్ పనులపై సమీక్షించండి



విశాఖపట్నం, : భీమిలి నుండి ఇచ్చాపురం వరకు నిర్మించనున్న బీచ్ కారిడార్ రోడ్డు నిర్మాణాలకు సంబందించిన పూర్తి నివేదికలను తయారు చేసి అందజేయాల్సిందిగా సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ కె.భాస్కర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబరులో బోగాపురం ఎయిర్ పోర్టుకు సంబందించి నిర్మించనున్న బీచ్ కారిడార్ నిర్మాణం పై ఇన్ క్యాప్, వి ఎం ఆర్ డి ఎ, జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి, భీమిలి, విజయనగరం జిల్లా భోగాపురం మండల రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. రోడ్డు నిర్మాణాలకు సంబందించి ప్రభుత్వ, ప్రవేట్ భూముల వివరాలను గుర్తించి మాష్టర్ ప్లాన్ ను తయారుచేయాలన్నారు. గ్రామాల వారిగా ఎఫ్ ఎం బి డేటా ను తయారు చేసి రెండు నెలలలోగ ఇవ్వాలన్నారు. బీచ్ కారిడార్ పురోగతిపై ప్రతి 15 రోజుల ఒకసారి సమీక్షించడం జరుగుతుందని, సంబంధిత అధికారులు తప్పని సరిగా హాజరవ్వాలన్నారు.

ఈ సమావేశంలో ఇన్ క్యాప్, వి ఎం ఆర్ డి ఎ, జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి, భీమిలి, విజయనగరం జిల్లా బోగాపురం మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. లూలు గ్రూపు చేపట్టనున్న మల్టీ ప్లెక్స్ మాల్స్ నిర్మాణాల పై సమీక్షించిన కలెక్టర్ : ఆర్ కె బీచ్ వద్ద విశ్వప్రియ ఫంక్షన్ హాలు ప్రదేశంలో లూలు గ్రూపు చేపట్టనున్న మల్టీ ప్లెక్స్ మాల్స్ నిర్మాణాలకు సంబందించి వి ఎం ఆర్ డి ఎ కమిషనర్ బసంతకుమార్, ఎ పి ఐ ఐ సి జెడ్ ఎం మరియు ఎస్ డి సి, జి.వి.ఎం సి అధికారులతో జిల్లా కలెక్టర్ కె.భాస్కర్ సమీక్షించారు. ఆయా స్థలానికి సంబందించిన పూర్తి వివరాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. నిర్మాణపు పనులను మొదలు పెట్టి త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా లూలు గ్రూపు ప్రతి నిధులకు స్పష్టం చేసారు. పసుపు - కుంకుమ నగదును లబ్దిదారులకు త్వరితగతిన పంపిణీ

పసుపు - కుంకుమ నగదును త్వరితగతిన పంపిణీ చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ కె.భాస్కర్ బ్యాంకర్లను ఆదేశించారు. బ్యాంకులకు ఎంత నగదు డిపాజిట్ అయినదన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని బ్యాంకుల నుండి సరియైన స్పందన లేదని లబ్దిదారుల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని, కాబట్టి అలసత్వం వహించకుండా ఎస్ హెచ్ జి మహిళ లబ్దిదారులకు నగదును అందజేయాలన్నారు.

ఈ సమావేశంలోడి ఆర్ డి ఎ ఇన్ చార్జి పిడి రామోహనరావు, ఎల్ డి ఎం, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## 'యాత్ర' సంబరాలు

నెల్లూరు : కావలిలోని లత థియేటర్ లో యాత్ర సినిమా విడుదల సందర్భంగా కేక్ కట్ చేసిన మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, కాకాణి గోవర్ధన్ రెడ్డి, కేతిరెడ్డి రామకోటా రెడ్డి, జగదీష్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. యాత్రకు ప్రజల నుంచి విశేషమైన స్పందన రావడం ఆనందంగా ఉందని ఎంపీ మేకపాటి అన్నారు. ఆయన మీడియా మాట్లాడుతూ.. వై.ఎస్.ఆర్ పాలనతో ప్రజలను మెప్పించారని.. ఆయన తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. యాత్ర సినిమాలో మమ్ముట్టి బాగా నటించారని అన్నారు.

## కోలాహలంగా దరఖాస్తుల స్వీకరణ

### 15 నుండి భరోసా యాత్ర



విశాఖపట్నం : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాలకు పెరుగుతున్న ఆశావాహులు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసేందుకు దరఖాస్తుల స్వీకరణ రెండో రోజు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ శాసనసభకు నేడు 19 మంది దరఖాస్తు చేసుకోగా మొత్తం 45 మంది, విశాఖపట్నం, అనకాపల్లి లోక్‌సభ స్థానాలకు మొత్తం ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ నెల 10 తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న సమయంలో శాసనసభకు రూ. 2 వేలు, లోక్‌సభకు రూ. 5 వేలు చెల్లించాలన్నారు. దరఖాస్తులను పీసీసీ పరిశీలించి ఏఐసీసీకి పంపుతారని అక్కడ పూర్థి స్థాయిలో పరిశీలించిన అనంతరం అభ్యర్థులకు టిక్కెట్లు కేటాయిస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుండి 28వ తేదీ వరకు ప్రత్యేక హోదా భరోసాయాత్రను అనంతపురం నుండి శ్రీకాకుళం వరకు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ యాత్రలో ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ వంటి ప్రముఖులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు బెహరా భాస్కరరావు, పేడాడ రమణకుమారి, పరుచూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## కోహ్లీ బాటలోనే సింధు.. బ్యాడ్మింటన్‌లో అతిపెద్ద డీల్!

న్యూఢిల్లీ : తెలుగు తేజం పీవీ సింధు టీమిండియా కెప్టెన్ కోహ్లి బాటలో నడిచింది. బ్యాడ్మింటన్ ప్రపంచంలోనే అతిపెద్ద డీల్‌ను సొంతం చేసుకుంది. రూ.50 కోట్లతో చైనీస్ బ్రాండ్‌తో ఒప్పందం చేసుకుంది.

బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు చైనీస్ స్పోర్ట్స్ బ్రాండ్ లీ నింగ్‌తో రూ.50 కోట్ల మేర ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ ప్రకారం తెలుగు బ్యాడ్మింటన్ ప్లేయర్ చైనా కంపెనీ నాలుగేళ్లపాటు స్పాన్సర్ చేయనుంది. గత నెలలో ఇదే సంస్థ కిదాంబి శ్రీకాంత్‌తో నాలుగేళ్లపాటు ఒప్పందం చేసుకుంది. ఇందుకోసం శ్రీకాంత్‌కు రూ.35 కోట్లు ఆఫర్ చేసింది. పారుపల్లి కశ్యప్‌తోనూ లీ నింగ్ రూ.8 కోట్లతో రెండేళ్లపాటు ఒప్పందం చేసుకుంది. స్పాన్సర్‌షిప్‌గా రూ.40 కోట్లు పొందనున్న సింధు.. క్రీడా సామాగ్రి రూపంలో మిగతా రూ.పది కోట్లను పొందనుంది.

ఇది లీ నింగ్-సింధు మధ్య కుదిరిన రెండో ఒప్పందం కావడం గమనార్హం. 2014-15లో ఏడాదికి రూ.1.25 కోట్ల చొప్పున రెండేళ్లపాటు సింధు ఒప్పందం చేసుకుంది. 2016లో సింధు యోనెక్స్‌తో కాంట్రాక్టు కుదుర్చుకుంది. ఏడాదికి రూ.3.5 కోట్ల చొప్పున మూడేళ్లకు ఈ ఒప్పందం కుదిరింది.

సింధుతో చైనా కంపెనీ కుదుర్చుకున్న డీల్ బ్యాడ్మింటన్‌లోని అతిపెద్ద ఒప్పందాల్లో ఒకటని తెలుస్తోంది. పుమాతో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి చేసుకున్న ఒప్పందంతో సింధు డీల్‌ను పోలుస్తున్నారు. 2017లో కోహ్లితో పుమా రూ.100 కోట్ల మేర ఒప్పందం చేసుకుంది. ఈ డీల్ ప్రకారం కోహ్లికి ఏడాదికి రూ.12.5 కోట్ల మేర అందుతాయి.

రియో ఒలింపిక్స్‌లో రజతం సాధించిన తొలి భారత మహిళగా రికార్డ్ నెలకొల్పిన సింధు.. అత్యధిక మొత్తం ఆర్జిస్తోన్న ఫోర్బ్స్ క్రీడాకారిణుల జాబితాలో గత ఏడాది ఏడో స్థానంలో నిలిచింది. చైనీస్ స్పోర్ట్స్ బ్రాండ్ అయిన లీ నింగ్.. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్‌తో రెండేళ్ల ఒప్పందం చేసుకుంది.

## నార్త్ జోన్ ఏసిపిగా ప్రసన్న కుమార్



మధురవాడ : మధురవాడ ఏసిపి కార్యాలయంలో శుక్రవారం నార్త్ జోన్ ఏసిపిగా ఏ.వి.ఎల్. ప్రసన్న కుమార్ బాధ్యతలు స్వీకరించారు, ఈ సందర్భంగా పీఎంపాలెం, భీమిలి, ఆనందపురం, పద్మనాభం స్టేషన్ల సిఐలతో సమావేశ మయ్యారు, అనంతరం రాన్నున్న ఎన్నికల దృష్ట్యా నార్త్ జోన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు సంబంధించి భీమిలి నియోజక వర్గం పరిధిలోని పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు, అందరకి సమన్యాయం రక్షణ కల్పించవలసిందిగా ఆదేశించారు, అలాగే స్థానిక సమస్యాత్మక గ్రామాలను ముందుగానే గుర్తించాలన్నారు, వివాదాస్పద వ్యక్తులను ఓ కంట కనిపెట్టాలన్నారు. అవసరమైతే రౌడీ షీట్లు తెరవాలన్నారు, ఈ విషయంలో ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.




## రెండో టీ-20లో భారత్ సునాయాస విజయం

ఆక్లాండ్: టీమిండియా లెక్క సరి చేసింది. తొలి మ్యాచ్‌లో ఓటమికి ప్రతీకారం తీర్చుకుని సిరీస్‌ను 1-1తో సమం చేసింది. న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో 7 వికెట్ల తేడాతో విజయ దుందుభి మోగించింది. ఆతిథ్య జట్టు నిర్దేశించిన 159 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. రోహిత్ శర్మ (50), రిషభ్ పంత్(40నాటౌట్), ధావన్ (30)రాణించడంతో లక్ష్యాన్ని అలవోకగా చేరుకుంది. మరో ఏడు బంతులు మిగిలి ఉండగానే టీమిండియా విజయతీరాలకు చేరింది. కివీస్ బౌలర్లలో లాకీ ఫెర్గూసన్, ఇష్ సోధీ, డేరిల్ మిచెల్ తలో వికెట్ తీశారు.

లక్ష్య ఛేదనలో టీమిండియా ఏ దశలోనూ తడబడలేదు. మ్యాచ్ విజయానికి ఓపెనర్ల పాత్రే కీలకమని మరోసారి టీమిండియా ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్ నిరూపించారు. 9ఓవర్ల వరకు వికెట్ కోల్పోకుండా ఆడిన ఈ జోడీ 79 పరుగుల భాగస్వామ్యాన్ని జట్టుకు అందించింది. ఈ క్రమంలో రోహిత్ శర్మ తన కెరీర్‌లో 20 అర్థ శతకాన్ని నమోదు చేసుకున్నాడు. అయితే ఇష్ సోధీ ఈ జంటను విడగొట్టాడు.9.2 ఓవర్లో సోధీ వేసిన బంతిని ఆడిన రోహిత్(50)..సోథీకి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. తర్వాత మరో రెండు ఓవర్ల వ్యవధిలోనే ధావన్(30) కూడా ఔటయ్యాడు. 10.5ఓవర్లో ఫెర్గూసన్ వేసిన బంతిని ఆడిన ధావన్..గ్రాండ్‌హోమ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.



**మ్యాచ్‌ను ముగించిన టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్..**

ఓపెనర్లను కోల్పోయిన తర్వాత మరో మూడు ఓవర్ల వ్యవధిలో విజయ్ శంకర్ మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. 13.4 ఓవర్లో మిచెల్ వేసిన బంతిని ఆడిన శంకర్ 14 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద పెవిలియన్ చేరాడు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ★ Phone : 2564353, Fax : 0891-2569004 ★ e-mail: vijayabhanudaily@gmail.com